
వార్త
ఆదివారం
24 డిసెంబరు, 2023
రాముడొచ్చాడు..

## మెగాస్టార్ సినిమాలో త్రిష?



మెగా స్టార్ చిరంజీవి కథానాయకుడుగా యంగ్ దర్శకుడు వశిష్ట ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిషను ఫైనల్ చేసినట్లు సమాచారం. ఈ సినిమాలో అభిమానులు, ప్రేక్షకులు మెగాస్టార్‌ను ఎలా చూడాలనుకుంటున్నారో ఆయన పాత్ర అచ్చం అలాగే ఉంటుందట. ఈ భారీ చిత్రానికి కీరవాణి సంగీతం అందిస్తుండగా యూవీ క్రియేషన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు. ఈ సినిమాకి 'విశ్వంభర' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# తారాతీరం

## షూటింగ్ మొదలైన 'గూఢచారి 2'



టాలీవుడ్ టాలెంటెడ్ హీరో అడివి శేష్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ వినయ్‌కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న స్పై యాక్షన్ థ్రిల్లర్ 'గూఢచారి 2'(జి2). పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మిస్తున్న ఈ చిత్రం 'గూఢచారి' సినిమాకి సీక్వెల్. ఈ చిత్రాన్ని అనౌన్స్ చేసి చాలా రోజులైంది. తాజా సమాచారం ఏమిటంటే ఇప్పుడు ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ మొదలైంది. అడివి శేష్ లుకికి సంబంధించిన పోస్టర్ సైతం గత వారం విడుదలైంది. శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషలో విడుదల కానుంది. ఈ సినిమాలో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఆదివారం వార్త
24 డిసెంబరు, 2023

## మంచి ముత్యాలు

పుస్తకాల మీద ప్రేమలేని మహదైశ్వర్యవంతుడు కూడా పరమ దరిద్రుడే. పుస్తక ప్రియత్వాన్ని కలిగియున్న నిరుపేద కూడా మహా ధనవంతుడే.

లాంగ్‌ఫెల్లో

## విషయ విశేషం

లోకరక్షకుడు ఉదయించెను... 4
'సంఘీ'భావం....5
నిరసన వద్దు మీరితే అనర్థమే
కవర్ స్టోరీ..6
రాముడొచ్చాడు..
అరుదైన కలం...11
ఈవారం కవిత్వం..12
ప్రేమ వర్ణాల ఇంద్రచాపం
ఔషధం-సుగంధం 'దాల్చిన' చెక్క....18
కథ.. 20
ఎ టేల్ ఆఫ్ మిసెస్ అరవింద
సాహిత్యం..23
తెలుగు సాహిత్యంలో బ్రౌన్
తుర్కియెలో అద్భుత వింతలు..25
'సంఘాత మేళ దోషం' అంటే?...29
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

## తాజా వార్తలు

### వ్యాయామం ఆరోగ్యం

కంప్యూటర్లకో లేదా టీవీకో అతుక్కుపోయి గంటల తరబడి కూర్చోవడం ఆరోగ్యానికి ఎంత హానికరమో తెలిసిందే. ఇది శరీరానికే కాదు, మెదడుకీ మంచిది కాదు, రక్త సరఫరా తగ్గిపోతుందనీ తద్వారా ఆలోచనాశక్తి, జ్ఞాపకశక్తి, ప్రణాళికాబద్ధంగా పనిచేయడం, ఏకాగ్రత..వంటి వన్నీ లోపిస్తాయనీ అంటున్నారు అమెరికన్ ఫిజియోలాజికల్ సొసైటీకి చెందిన పరిశీలకులు. అదే మెదడుకు రక్త సరఫరా సరిగ్గా ఉంటే మతిమరుపు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ఈ విషయాన్ని ఆరోగ్యంగా ఉండే ఇరవైమంది చరుకైన యువతీయువకుల్లో పరిశీలించి మరీ చెబుతున్నారు. వీళ్లలో ఒక వర్గాన్ని మూడుగంటలపాటు కదలకుండా కూర్చునేలా చేశారట. మరో వర్గాన్ని ప్రతి 20 నిమిషాలకు లేపి నిమిషంపాటు స్క్వాట్ వ్యాయామాల్ని చేయించారట. కూర్చోవడానికి ముందూ తరవాతా వాళ్ల మానసిక స్థితినీ, ఏకాగ్రతనీ, చురుకుదనాన్నీ రకరకాలుగా పరీక్షించారు. అక్షరాలూ సంఖ్యలూ ఉన్న కొన్ని పజిల్స్‌ను కూడా చేయించారు. అదేపనిగా కూర్చున్నవాళ్లలో మెదడుకు వెళ్లే రక్తసరఫరా కూడా తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

### జోక్స్..జోక్స్

పనిమనిషి: ఆ ఇంట్లో ఎందుకు పని మానేసావు?
మరో పనిమనిషి: ఆ ఇంట్లో వంటగదిలో సిసిటివి కెమెరా ఏర్పాటు చేసారు.
పనిమనిషి: కెమెరా ఏర్పాటు చేస్తే ఏమవుతుంది? మన పని మనం చేస్తాం కదా!
మరో పనిమనిషి: పిండీ, కూరగాయలు మొదలైన మిగిలిన పదార్థాలు నేను తీసుకెళ్తాను కదా..నోరు జారింది.

...

దొంగ: నువ్వు ఈ మధ్య దొంగతనాలు మానేసావు. ఏమైంది?
మరో దొంగ: ఏ ఇంటికి వెళ్లినా కుక్క ఉంది జాగ్రత్త అని బోర్డు పెడుతున్నారు.
దొంగ: కుక్క కరిస్తే దొరికిపోతావని దొంగతనాలకి వెళ్లడం లేదా?
మరో దొంగ: అందుకు కాదు. అది కరిస్తే బొడ్డు దగ్గర ఇంజెక్షన్స్ చేయించుకోవాలి కదా. అందుకని.

- ఎస్.కె.యాకుబ్‌పాషా, ఖమ్మం

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# లోకరక్షకుడు ఉదయించెను..




**గుమికూడిన** ప్రజాసమూహం కలిసి ఒక చోట చేరి, క్రీస్తును ఆరాధించడం, పూజించడమే క్రైస్టమాస్, అదే క్రిస్మస్! క్రీస్తు పుట్టిన రోజే క్రిస్మస్. క్రీస్తు ఎవరు? క్రీస్తు ఒక మెస్సయా ప్రవక్త అంటారు కొందరు. హవ్వ ఆదాములు, దేవుడు తినొద్దన్న పండు తిని, అది జ్ఞానవృక్షం పండు కనుక అది తింటే చాలు, జ్ఞానం పెరిగిపోతుంది కనుక. ఎక్కడలేని తెలివితేటలు వచ్చేస్తాయి...అనుకుంటూ తొలిపాపం చేశారు. అంటే, దేవుడి ఇచ్చిన ఆజ్ఞను పాటించకుండా పాపం చేశారు. అవిధేయత వల్ల శాపగ్రస్తులయ్యారు. అంటే ఆ సౌఖ్యాల మోక్షపు తోటలోంచి గెంటివేయబడ్డారు. తలుపులు మూయబడ్డాయి. విమోచకుడు వచ్చేంత వరకు, మీ పాపాలు తొలగించబడవు, ఈ తలుపులు తీయబడవు అని దేవుడు అన్నాడు ఆనాడు. ఈనాడు ఆ పాప విమోచకుడైన ప్రభువు రానే వచ్చాడు. మరియ అనే ఒక కన్యక పరిశుద్ధాత్మ వలన గర్భం దాల్చి, క్రీస్తుకు జన్మనిచ్చింది. క్రీస్తు జన్మించిన తర్వాత ఆకాశంలో ఒక నక్షత్రం పొడిచింది. తూర్పుదేశపు జ్ఞానులు ఆ నక్షత్రాన్ని చూసి, బేత్లెహేముకు యేసుక్రీస్తును ఆరాధించేందుకు వచ్చారు. రాత్రిసమయంలో దేవుడి దూత గొర్రెల కాపరుల వద్దకు వచ్చి, దావీదు పట్టణంలో 'రక్షకుడు' మీకొరకు పుట్టియున్నాడని చెప్పాడు. 'దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు, ఈయన ప్రభువైన క్రీస్తు. దానికిదే మీ కానవాలు, ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొక తొట్టిలో పండుకొనియుండుట మీరు చూచెదరు' (లూకా 2:11,12) అని చెప్పాడు. గొర్రెల కాపరులు ఆ మాటల్ని విన్న తర్వాత సంతోషంతో తల్లి అయిన మరియను, శిశువు అయిన యేసుక్రీస్తును చూసారు. వారు ప్రభువును ఆరాధించి, తమ స్వంత ఊర్లకు వెళ్లిపోయారు. తూర్పుదేశపు జ్ఞానులు కూడా యేసుక్రీస్తును ఆరాధించి, తమ స్థలాలకు వెళ్లిపోయారు. ఆనాటి నుండి నేటి వరకు యేసుక్రీస్తు తన భక్తుల ద్వారా ఆరాధించబడుతూనే వున్నాడు. జ్ఞానులు బంగారు, బోళము, సాంబ్రాణిని అర్పించి, పూజించారు.



## క్రిస్మస్ ట్రీ

క్రైస్తవులు క్రిస్మస్ సందర్భంగా 'మిడ్‌నైట్' పూజాసందడిలో పాల్గొని, క్రీస్తును పూజిస్తారు. కేకులను కట్‌చేసి, విందులు ఏర్పాటు చేసుకుంటారు. ఇక్కడ 'క్రిస్మస్ ట్రీ' అనేది ఒక విశేషం. ఇది నిత్యజీవానికి చిహ్నంగా ఈ శుభఘడియల్లో కనిపిస్తుంది. మరీ ముఖ్యంగా మంచుచే కప్పబడిన వృక్షాలు క్రీస్తు జనన విశేషంతో ఆ మంచును విదిలించుకొని పచ్చదనం తొడుక్కొని కళకళలాడిపోతాయట. ఆ సందర్భంలో క్రీస్తు మహిమ వల్ల జరిగిన ఈ కళ, కలకాలం ఉండాలి అనే సదుద్దేశ్యంతో పుట్టుకొచ్చిందే 'క్రిస్మస్ ట్రీ!. ఈ 'ట్రీ సంస్కృతి' క్రీస్తుపూర్వం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇది నిత్యజీవన చిహ్నంగా నిలిచింది.

## క్రిస్మస్ అంటే ఆరాధనే..

డా॥దేవదాసు బెర్నార్డ్ రాజు

క్రిస్మస్ అంటే కొత్తబట్టలు, పిండివంటలు, డెకరేషన్స్ ఇవన్నీ పండుగలో ఒక భాగమైనా క్రిస్మస్ అంటే దేవుడిని ఆరాధించేందుకు మనం సిద్ధపడాలి. క్రీస్తు లేని సెమిక్రిస్మస్‌లు, గ్రాండ్‌క్రిస్మస్‌లు అంటూ భారీఎత్తున సెట్టింగ్స్‌తో, లైట్లతో, హంగులు, ఆర్భాటాలతో మీటింగులను ఏర్పాటు చేసుకుంటే దానివల్ల లాభం లేదు. మనం ఎంత గ్రాండ్‌గా చేసుకున్నా, చేసుకోలేకపోయినా పర్వాలేదు కానీ క్రీస్తును కేంద్రీకృతమైన ఆరాధన చేయడం మనకెంతో క్షేమకరం. ఇంతకూ, ఏమిటి యీయన జననంలోని ప్రత్యేకత? ఔను! మనిషిని మార్చి తనలా చేయడానికై వచ్చాడు యేసు. మనిషిని దేవుడ్ని చేయడానికై దేవుడే దిగి వచ్చిన వేళా విశేషం ఇది. మానవుడి విమోచన కోసం మనిషిగా జన్మించి, మరణించి, మూడవరోజున తిరిగి పునరుత్థానమై యేసుక్రీస్తును సొంతరక్షకుడిగా అంగీకరించి వారే క్రిస్మస్ ఆనందాన్ని అనుభవించగలరు. ఆయన మనకోసం మరణించాడు కాబట్టే తనను పూజించమన్నాడు. అంతేకాదు సాటి మనిషినీ ప్రేమించమన్నాడు. నిన్నువలె నీ పొరుగువారిని ప్రేమించమన్నాడు. ఈ రెండు సూత్రాలతో మనిషిని, దేవునిలా మార్చేయడానికై వచ్చిన పరిపూర్ణ దేవుడు క్రీస్తు. ఇలాంటి దేవుడిని మనం మనస్ఫూర్తిగా ఆరాధిద్దాం.

## 'సంఘీ' భావం



# నిరసన హద్దు మీరితే అనర్థమే

ప్రజాస్వామ్య దేశంలో హక్కులకు ఎంత ప్రాధాన్యత ఉందో అంత కంటే ఎక్కువ స్వేచ్ఛ నిరసనలు తెలపడానికి ఉంది. వ్యవస్థలో గాని, పాలనలో కాని, మరేదైనా అంశంలో సమస్య ఎదురౌతున్నట్లు భావిస్తే దానిని వ్యక్తీకరించేందుకు నిరసనల మార్గాన్ని అనుసరించవచ్చని స్పష్టంగా ఉంది. ఇందులో భాగంగానే సమ్మెలు, ఉద్యమాలు, దీక్షలు, నిరసన కార్యక్రమాలు ఉన్నాయి. అయితే వీటిని అనుసరించే సమయంలో కొన్ని హద్దులు, నిబంధనలు ఉన్నాయి. దానిని అనుసరించకుండా చట్టనిబంధనలను అతిక్రమించి నిరసనలు తెలిపితే సమస్య పరిష్కారం సంగతి పక్కన పెడితే అనర్థాలే ఎక్కువ ఉంటాయి. ఉదాహరణకు ఇటీవల పార్లమెంటులో జరిగిన పొగ దాడి సంఘటన. ఆరేడుగురు కలిసి కొన్ని చట్టాలను, కొన్ని విధానాలను వ్యతిరేకించి నిరసన తెలిపేందుకు నిర్ణయించుకున్నారు. దానికి అభ్యంతరమేమీ లేదు. ఎవరైనా వీరికి మద్దతుగానే నిలుస్తారు. అయితే నిరసన తెలిపిన విధానం వీరిని నేరస్తులుగాను, దేశద్రోహులుగాను నిలబెట్టింది. అతిపెద్ద ప్రజాస్వామ్య, సెక్యులర్ దేశంగా విరాజిల్లుతున్న భారత్‌లో పార్లమెంటుకు అత్యున్నత స్థానం ఉంది. భారతదేశానికి పార్లమెంటు ఒక ఆలయం వంటిదని వ్యాఖ్యానిస్తుంటారు. అలాంటి అతిముఖ్యమైన ప్రాంతంలో అలజడి సృష్టించడం ద్వారా తమ సమస్యను వెలుగులోకి తీసుకురావాలని ప్రయత్నించడం దుస్సాహసమే అవుతుంది. వీరు చేసిన తొందరపాటు, అనాలోచిత చర్య వల్ల సమస్య గురించి ప్రస్తావన కంటే పార్లమెంటు భద్రత, దేశ సౌభ్రాతృత్వానికి కలిగిన మచ్చపై ప్రతిఒక్కరూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు భారత్‌లో భద్రత లేదన్న అంశాన్ని ప్రస్తావించడం ప్రారంభించాయి. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతూ ముందుకు సాగుతున్న తరుణంలో ఈ ఘటన వల్ల కలిగిన నష్టం తక్కువేమీ కాదు. ఉద్యోగాలు లభించడంలేదని, రైతు చట్టాల్లో లోపాలు ఉన్నాయని తదితర అంశాలపై వీరు ఈ చర్యకు పాల్పడ్డారు. పార్లమెంటులో అలజడి సృష్టిస్తే ఇవన్నీ పరిష్కారం కావని వారు ఆలోచించలేకపోయారు. భూమిపై పుట్టినప్పటి నుంచి అనేక సందర్భాల్లో ప్రతి ఒక్కరూ తమ నిరసనను తెలిపే ఉంటారు. ఇంట్లో తల్లిదండ్రులు తమకు ఇబ్బంది కలిగించినప్పుడు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు పట్ల, ఉద్యోగాల కోసం ఎదురు చూపులు చూస్తున్న వేళ, ఉద్యోగంలో చేరిన తరువాత యాజమాన్య నియంతృత్వ వైఖరి పట్ల ఇలా ప్రతి సందర్భంలోను నిరసన గళం వినిపించడం సర్వసాధారణం. ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు పలు సందర్భాల్లో ఉద్యమాల్లో చేపడుతూ ఉంటారు. అది దశల వారీగా ఉధృతం చేస్తారు. ముందు నోటీసులు ఇస్తారు. ఆ తరువాత నల్ల బ్యాడ్జీలు ధరిస్తారు. సమయపాలన మేరకే విధులు అని పని వేళలు అంటూ ఉద్యమాలు చేపడతారు. చివర్లో విధులకు గైర్హాజరై తమ నిరసన తెలుపుతారు. ఇది కూడా వ్యవస్థలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. ఏదైనా ఒక పరిశ్రమలో సమస్య ఎదురైనప్పుడు వాటిపై మాత్రమే దృష్టి సారిస్తారే కాని ఏకంగా పరిశ్రమ మూత పడాలన్న దృక్పథం, ఉద్దేశ్యం ఏమాత్రం ఉండదు. అదేవిధంగా ఒక కార్యాలయంలో అధికారి నియంతృత్వ పోకడలతో వేధింపులకు గురైనప్పుడు ఆయనలో మార్పు తీసుకురావడానికి నిరసన గళం వినిపిస్తారు. ఆయనను ఉద్యోగంలోనుంచి తొలగించాని, లేక జైలుకు పంపించాలన్న ఉద్దేశ్యం ఉండదు. దీనికంటే వారి సమస్య పరిష్కారం ముఖ్యం కాబట్టి దానిపై దృష్టి కేంద్రీకరిస్తారు. ఉద్యమాలు కాని, నిరసనలు కాని హద్దు మీరనంత వరకు సమాజంలో అనేక వర్గాలు అండగా ఉంటాయి. గతంలో సమ్మె అంటే చాలు బస్సుల దగ్ధం అనే కార్యక్రమం చేపట్టే వారు. పెద్ద సంఖ్యలో బస్సులు దగ్ధం కావడం వల్ల ప్రజలకే నష్టం అనే కోణంతో ఆలోచన జరిగేది కాదు. ఇలాంటి సందర్భాల్లో సమాజంలోని అనేక వర్గాలు ఈ చర్యలను ఖండించడంతో ఉద్యమకారులు తాము చేస్తున్న నిరసన కార్యక్రమాలకు మద్దతు కోల్పోయే వారు. క్రమంగా ప్రజల్లో మార్పు వచ్చింది. ఇప్పుడు ఎక్కువగా దీక్షలు, ధర్నాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇంతకంటే ఉధృతం చేయాలంటే బంద్‌లకు పిలుపునిస్తున్నారు. సమస్య పరిష్కారానికి అనేక వర్గాల నుంచి ఒత్తిడి రావడంతో అనుకున్నది సాధించుకోవచ్చు. మరో ఉదాహరణ చెప్పుకోవాలంటే ఆంధ్రలో కాపు ఉద్యమం జరిగే సమయంలో తుని వద్ద రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలును అడ్డగించి కొందరు దుండగులు నిప్పు పెట్టారు. దీనితో ఉద్యమం ఒక్కసారిగా నీరుకారిపోయింది. తీవ్రస్థాయిలో జరుగుతున్న ఉద్యమం ఇలాంటి చర్యతో అనుకున్నది సాధించలేకపోగా నేతలపై వ్యతిరేకత మొదలైంది. ఉద్యమానికి రత్నాచల్ రైలుకు ఏమాత్రం సంబంధం లేదు. రత్నాచల్ రైలు ప్రజల కోసం తిరుగుతున్న ఒక సేవా సర్వీసు. దానికి నిప్పు పెట్టడంతో సమాజంలో అన్ని వర్గాలు వ్యతిరేకించాయి. నిరసన తెలపదలచుకున్న వారు ముందుగా తాము చేస్తున్న పని చట్టపరిధిలోకి వస్తుందా లేదా అన్న కోణంతో ఆలోచించాలి. తమ సమస్య ప్రపంచ సమస్య కాదని అర్థం చేసుకోవాలి. చట్టానికి లోబడి, పరిధి దాటని ఉద్యమాలు విజయవంతం అవుతాయి. రైతులు తమ ఉద్యమాన్ని ఎంతో హుందాగా నడపి పాక్షిక విజయాన్ని సాధించారు. వారు హద్దు మీరలేదు. ప్రపంచంలో అన్ని దేశాలు ఏదో ఒక సమస్యను ఎదుర్కొంటూ ఉంటాయి. ఈ సమయంలో తాము చేసే ఉద్యమాలు, నిరసనలు ఆయా దేశాలకు, వ్యవస్థలకు మచ్చ తెచ్చేవిగా ఉండకూడదన్న విషయం ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

వైదేహి సహితం సురద్రుమతలే
హైమే మహామండపే మధ్యే పుష్పక
మాసనే మణియమే వీరాసనే
సుస్థితం-అగ్రే వాచయతి ప్రభం
జనసుతే తత్వం-మునిభ్యఃపరం
వ్యాఖ్యాంతం భరతాదిభిహి
పరివృతం-రామం భజే శ్యామలం
శతాబ్దాల కల ఫలిస్తున్న
శుభతరుణమిది. మర్యాదా
పురుషోత్తముడైన రాముడు..తన
జన్మభూమి కోసం రావణుడితో
కంటే..మించి చేసిన యుద్ధం
ఫలితమిస్తున్న శుభ సందర్భమిది.





# రాముడొచ్చాడు..

కోట్లమంది భారతీయుల కష్టాల్లో, సుఖాల్లో..భయంలో, అభయంలో..రాత్రి,పగలు, సాయంత్రం అన్న తేడా లేకుండా..అనవరతం తోడై నిలిచిన తారకమంత్రం రామనామం. ఇవాళ తాను పుట్టిన భూమిపై..దివ్యమైన, భవ్యమైన, మహాద్భుతమైన మందిరంలో కొలువై..తన వారందరినీ అనుగ్రహించబోతున్నాడు రాముడు. ఏండ్ల తరబడి సాగిన కోర్టు వ్యాజ్యాలు అంతమై కోట్లాది హిందువుల కలలు సాకారమవుతున్న సమయమిది. జనవరి 22న రామమందిరం ద్వారాలు తెరుచుకుంటున్నాయి. రామచంద్ర ప్రభువు తన వారందరినీ కటాక్షించబోతున్నాడు. ఈ క్షణం కోసం ఎందరు కలలు కన్నారో..ఈక్షణం కోసం ఎందరు అసువులు బాసారో..ఈక్షణం కోసం..చకోరపక్షుల్లా వేచిచూసి చూసి ఎందరు తనువులు చాలించారో..వారందరికీ..ఈక్షణం మోక్షాన్ని ప్రసాదిస్తుంది. ఈ క్షణాన్ని చూస్తున్న కోట్లాది హిందువుల తనువులు పులకరించిపోతున్నాయి. రామమందిరం నిర్మాణం పూర్తయింది. గర్భాలయంలో రామచంద్రుడు కొలువుతీరి సమస్త భారత భూమండలాన్ని తిరిగి శాసించబోతున్నాడు. అనేక ఏండ్ల వనవాసం పూర్తయి మరొక్కసారి పట్టాభిషక్తుడు కాబోతున్నాడు. అయోధ్య అంటే యుద్ధానికి శక్యం కానిది అని అర్థం. ఇవాళ అయోధ్య నగరం అచ్చంగా అలాగే కనిపిస్తున్నది. రామాయణంలో వర్ణించిన అద్భుత నగరం తిరిగి ఆవిష్కారమైంది. నగరంలో ప్రవేశించగానే...త్రేతాయుగం ఇలాగే ఉండేదా అని అనిపిస్తున్నది. అయోధ్యలోని ప్రధాన దారుల్లో సూర్యస్తంభాలు, రామస్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా రామమందిరానికి వెళ్లేదారిని ధర్మమార్గంగా పేర్కొంటున్నారు. ఈ ధర్మమార్గం దగ్గర 9 మీటర్ల ఎత్తైన సూర్యస్తంభాలు ఏర్పాటు చేశారు. దాదాపు 2కిలోమీటర్ల దూరం ఉన్న ఈ మార్గంలో మొత్తం 40 సూర్యస్తంభాలు ఏర్పాటయ్యాయి. దారిలోని కూడళ్లలో రాములవారి పాదుకలను, వీణను ఏర్పాటు చేశారు. రామాయణకాలం నాటి అనేక అంశాలను ప్రతిబింబించే అనేక చిహ్నాలు, ప్రతీకలను దారులెంటా ఏర్పాటు చేశారు. నడుస్తున్న కొద్దీ రామాయణం అంతా మన కళ్లముందు జరుగుతున్నదా అనిపించేంతగా రామమందిర మార్గాలు నిర్మాణమయ్యాయి. రామమందిరం గర్భగుడిలో మూలవిరాట్టు ప్రాణ ప్రతిష్ఠకోసం అవసరమైన పీఠాన్ని ఏర్పాటు చేశారు.

**కవర్ స్టోరీ**

**కోవెల సంతోష్ కుమార్**

రామమందిర ప్రాంగణ విస్తీర్ణం 67 ఎకరాలు కాగా 2.77 ఎకరాల విస్తీర్ణంలో ఈ అద్భుతమైన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయం పొడవు 360 అడుగులు కాగా..వెడల్పు 235 అడుగులు..ఒక్కో అంతస్తు 20 అడుగులు..362 స్తంభాలు. మొదటి అంతస్తు నుంచి గర్భగుడి గోపుర శిఖరం వరకు ఆలయం ఎత్తు 161 అడుగులు. మొదటి అంతస్తు 160 స్తంభాలు, రెండో అంతస్తులో 132 స్తంభాలు, మూడో అంతస్తులో 70 స్తంభాలతో సర్వాంగ సుందరంగా ఈ ఆలయాన్ని నిర్మించారు. 2020 ఆగస్టు 5న ఈ ఆలయ నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్రమోడి భూమిపూజ నిర్వహించి నాంది పలికారు. జనవరి 22న రామచంద్రుల వారి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది. జనవరి 23 నుంచి సాధారణ దర్శనాలు ప్రారంభమవుతాయి. అదే సమయంలో అయోధ్యలో విమానాశ్రయం కూడా ప్రారంభమవుతుంది.

## ఇది రామ భారతం

రామాయణం అంటే భారతదేశం..రామాయణం అంటే భారతీయ జీవన దృక్పథం, రామాయణమంటే మూర్తీభవించిన భారతీయ ధర్మం, రామాయణం అంటే భారతీయుల మూలపురుషుడి చరిత్ర, రామాయణమే వేదం, వేదమే రామాయణం, రామాయణం మనకే కాదు..విశ్వానికీ

ఈ రకమైన సంస్కృతి, నాగరికతను, జీవన విలువలను, కుటుంబ వ్యవస్థను, సామాజిక బాధ్యతను తాను ముందుగా అనుసరించి, లోకానికి దారి చూపించిన వాడు రాముడు. ఆసేతు హిమాచలం, అన్ని దిక్కులకు చెందిన ప్రజలు రాముడు చూపిన నాగరిక భావనలను, సంస్కృతిని తమంత తాముగా స్వీకరించి అనుసరించారు. ఒకరు అదే పనిగా ప్రచారాలు చేయడం..వారి వారి విశ్వాసాలను మార్చివేసి తమ విశ్వాసాల పరిధిలోకి ఆకర్షించడం లాంటి వ్యవస్థలు ఆనాడు లేవు. ఒక పక్క కుటుంబ వ్యవస్థను పరిరక్షించుకుంటూనే సమాజపు అవసరాలను బట్టి రక్షణ, నగర నిర్మాణాలు, వ్యవసాయం వంటి రకరకాల పనులకు సంబంధించిన వ్యవస్థలు ఏర్పడ్డాయి. సమాజం కోసం ఎలాంటి మార్పులు చేసినా..కుటుంబ వ్యవస్థ, విలువల పరిరక్షణ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. మహిళలు అన్ని రంగాల్లో రాణించారు. రామాయణంలో మహిళల పట్ల వివక్ష చూపలేదు. అసలు..రామయణం మరో పేరు సీతాయాశ్చరితం. మహత్. కైకేయి, తారవంటి వారు అసాధఃరణ మంత్రాంగం నడిపినవారు. రాముడిని లంక దాకా తీసుకెళ్లిందే సీతాదేవి. 'నేను ముందు నడుస్త నీ దారిలో రాళ్ల ముళ్లు తొలగిస్తాను' అని అంటూ ఆమె నడిచింది. లంక సమాజంలో మోరల్‌ను దెబ్బతీసింది. మహిళను కాపాడటమే లక్ష్యంగా రామాయణం సాగింది. ఈ జీవన విధానమే భారతీయమైంది. భారతీయులను సమస్రాబుద్దులుగా కలిపి ఉంచుతున్నది.

## ఇదీ వివాద చరిత్ర

అలాంటి రాముడి జన్మస్థలంపై మంగోలులు దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. మందిర విధ్వంసం చేసి మసీదు కట్టారు. 1528లో మందిరాన్ని ధ్వంసం చేసి మసీదును నిర్మించినట్టు అక్కడి శాసనాలు చెప్తున్నాయి. అక్కడ రాముడి ఆనవాళ్లు లేకుండా చేయడానికి ప్రయత్నించారు. అప్పడి నుండి కూడా ఆ ప్రాంతంలో రాముడి మందిరం కోసం పోరాటం కొనసాగుతూనే ఉన్నది. మందిర్ మసీదు వివాదం.. దాదాపు మూడు దశాబ్దాల పాటు ఈ దేశ రాజకీయాలను శాసిస్తూ వచ్చాయి. రథయాత్రతో బీజేపీ నేత అద్వానీ మందిర ఉద్యమాన్ని దేశ వ్యాప్తం చేసి బీజేపీకి తిరుగులేని రాజకీయ జీవితాన్ని ఇస్తే బాబ్రీ కట్టడం కూల్చివేత పీవీ నరసింహారావు వంటి ఓ గొప్ప రాజకీయ దిగ్గజానికి అస్తిత్వమే లేకుండా చేసింది. ఇదే





రామమందిర వివాదం మతతత్వ పార్టీ అన్న ముద్ర వేసుకున్న బీజేపీని అధికారంపై కూర్చోబెట్టగలిగింది. ఇదే రామమందిర వివాదం దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాల పైకి తీసుకొచ్చి పునర్జన్మనిచ్చిన నేత మరణిస్తే సొంత పార్టీ సైతం చేర్చుకోలేకపోయింది.

1528లో మందిరాన్ని ధ్వంసం చేసి బాబర్ మసీదును నిర్మించారు. 1611లో అయోధ్యలో రాముడి కోట, యాత్రికులు సందర్శించే ఇండ్లు ఉన్నట్టు ఒక ఆంగ్ల వ్యాపారి విలియం పింఛ్ తాను చూసినదాన్ని రికార్డు చేశాడు. 1853 దాకా ఇక్కడ మత ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. సిపాయిల తిరుగుబాటు జరిగిన తరువాత బ్రిటిష్‌వారు ఈ ప్రాంతంలో రెండు వేర్వేరు ప్రార్థనా స్థలాలను కేటాయించి కంచె వేశారు. బాబ్రీ కట్టడం లోపల విగ్రహాలను ఉంచేసరికి 1949లో సివిల్ వాదా పడింది. దీంతో ఆ ప్రాంతంపై యాజమాన్యం కోసం కేసులు పడ్డాయి. 1961లో మరో కేసు పడింది. బాబ్రీ మసీదును బలవంతంగా ఆక్రమించి అందులో విగ్రహాలు పెట్టారని వాటిని తొలగించి తమ మసీదును తమకు అప్పగించాలని ఆ కేసులో పిటిషనర్ వాదించారు. మరోవైపు రామజన్మభూమి స్థలంలో ఆలయ నిర్మాణం చేపట్టడానికి, నాయకత్వం వహించడానికి హిందూ సమూహాలు కమిటీ ఏర్పాటు చేసి ఆలయ నిర్మాణానికి ఉద్యమించాయి. 1984 నుంచి మందిర నిర్మాణ ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుకొన్నది. 1949లో న్యాయస్థానం ఆదేశాలతో మూతపడిన బాబ్రీ కట్టడం తలుపులు 37 సంవత్సరాల తరువాత 1986లో తెరుచుకున్నాయి. వివాదాస్పద కట్టడం లోపల పూజలు చేసుకోవడానికి హిందువులకు అనుమతిస్తూ స్థానిక జిల్లా న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. కోర్టు తీర్పు వచ్చిన గంటలోపే బాబ్రీ తలుపులు తెరుచుకున్నాయి. దీంతో ముస్లింలు బాబ్రీ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసుకొని ఉద్యమం ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ మందిర ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. రాముడు పుట్టిన చోట శిలాన్యాస్ చేస్తానని ప్రకటించింది. అప్పుడు ప్రధానమంత్రిగా ఉన్న రాజీవ్‌గాంధీ అందుకు అంగీకరించడంతో హోం మంత్రి బూటాసింగ్, అప్పటి యూపీ ముఖ్యమంత్రి ఎన్టీ తివారీ నేతృత్వంలో వివాదాస్పద స్థలం పక్కన ఖాళీ భూమిలో శిలాన్యాస్ జరిగింది. దీంతో మత ఘర్షణలకు నాంది పలికినట్టయింది. ఈ ఉద్యమంతో రెండు సీట్లతో ఉన్న బీజేపీ ఏకంగా 58 సీట్లు గెలుచుకున్నది. బీజేపీ మద్దతుతో వీపీ సింగ్ ప్రధానమంత్రి అయ్యారు.

అద్వానీ రథయాత్ర చేపట్టారు. 1990 అక్టోబరు 30న ఉత్తరప్రదేశ్‌లో కనీవినీ ఎరుగని మారణకాండ జరిగింది. యూపీ సీఎం ములాయంసింగ్ యాదవ్ ఆదేశాలపై అయోధ్యకు వచ్చిన కరసేవకులపై పోలీసులు అమానుషంగా దమనకాండ చేశారు. వేల మంది కరసేవకులను కాల్చి చంపడమే కాకుండా వారి మృతదేహాలను సరయూ నదిలో విసిరి పారేశారు.



## బాబ్రీ విధ్వంసం..

1991లో పీవీ నరసింహారావు నేతృత్వంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. అటు బీజేపీ కేంద్రంలో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. హిందీ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చింది. కల్యాణ్‌సింగ్ యూపీ సీఎం అయ్యారు. ఆయన సీఎం కావడంతోనే అయోధ్యలోని 2.77 ఎకరాల భూమిని సేకరించి రామజన్మభూమి న్యాస్ ట్రస్ట్‌కు లీజ్‌కు ఇచ్చింది. కానీ అలహాబాద్ హైకోర్టు మాత్రం ఇక్కడ ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించింది. కానీ హైకోర్టు ఆదేశాలు పట్టించుకోకుండా 2.77 ఎకరాల భూమిని చదును చేయడానికి కల్యాణ్‌సింగ్ అనుమతించారు. అదే సమయంలో విశ్వహిందూ పరిషత్ సహాయంతో రామజన్మభూమి ట్రస్ట్ మందిర నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రారంభించింది. సోమ్‌పూర్ కుటుంబీకులు ఆలయ నిర్మాణానికి డిజైన్ రూపొందించారు. అప్పుడు రూపొందించిన డిజైన్ ప్రకారమే ఇప్పుడు ఆలయం తయారైంది.




1991లోనే స్తంభాలు, గోడల నిర్మాణానికి మేలైన రాళ్లను తెప్పించి శిల్ప నిర్మాణాలు ప్రారంభించింది. అయోధ్యలో ఇప్పుడు నిర్మించిన ఆలయానికి సమీపంలో కరసేవక పురాన్ని ఏర్పాటు చేసి అక్కడ ఆలయానికి సంబంధించిన పనులు మొదలు పెట్టారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన సామగ్రి అంతా ఇక్కడి నుంచే సరఫరా అయింది.

కల్యాణ్ సింగ్ యూపీలో అధికారంలోకి రావడంతో ఈ ప్రాంతంలోకి ప్రవేశించడం సులభతరమైంది. అంతేకాకుండా ఆ ప్రాంతానికి కేంద్ర పోలీసు బలగాలను పంపించాలన్న పీవీ సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకించారు. కరసేవకులపై ఎలాంటి కాల్పులు జరపబోమని హామీ ఇచ్చారు. 1992 జులైలో కరసేవకులు సమావేశమై ఆలయ నిర్వాహణ పనులు మొదలుపెట్టారు. కానీ ప్రధాని జోక్యంతో ఈ పని ఆగిపోయింది. 1992 డిసెంబరు 6 నుంచి కరసేవ ప్రారంభమవుతుందని వీహెచ్‌పీ ప్రకటించింది. అటు 1989లో వేసిన పునాది నిర్మాణం చట్టబద్ధతపై అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టింది. కానీ, దాదాపు 20 వేల మంది కరసేవకులు అయోధ్య చేరి డిసెంబరు 6న బాబ్రీ కట్టడాన్ని కూల్చివేశారు. ఆ తరువాత దీనిపై పీవీ సర్కారు జస్టిస్ లిబరహాన్ కమిటీని ఈ ఘటనను విచారించడానికి నియమించింది.

## ఆలయానికి సంబంధించిన ఆధారాలు

2003లో బాబ్రీ కట్టడం కింద ఆలయం ఉన్నదా లేదా అన్న అంశంపై సర్వే చేసి నివేదిక సమర్పించాలని కేంద్రాన్ని న్యాయస్థానం ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ఆనవాళ్లను సర్వే ఆఫ్ ఇండియా కోర్టుకు సమర్పించింది. 2010 సెప్టెంబరు 30న అయోధ్య వివాదానికి సంబంధించిన నాలుగు టైటిల్ సూట్‌లపై అలహాబాద్ హైకోర్టు తన తీర్పును ప్రకటించింది. అయోధ్య భూమిని మూడు భాగాలుగా విభజించాలి. 1/3 హిందూ మహాసభ ప్రాతినిధ్యం వహిస్తున్న రామ్‌లల్లాకు, 1/3 ఉత్తరప్రదేశ్ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు, 1/3 నిర్మోహి అఖారాకు వెళుతుంది. దీంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఇరు పక్షాలు ఈ తీర్పుపై సుప్రీంను ఆశ్రయించడంతో సుప్రీంకోర్టు యథాతథ స్థితిని కొనసాగిస్తూ తీర్పు చెప్పింది. 2019 ఆగస్టులో సుప్రీంకోర్టు రెగ్యులర్ విచారణను చేపట్టింది. 2019 అక్టోబర్ 16న విచారణ ముగిసింది. తీర్పు రిజర్వు అయింది. నవంబర్ 9న బాబ్రీ స్థలంలో అంటే రామజన్మభూమిలో మందిర నిర్మాణానికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. మసీదు నిర్మాణానికి మరో ప్రాంతంలో ఐదెకరాలు ఇవ్వాలని కేంద్రాన్ని న్యాయస్థానం ఆదేశించింది. తీర్పును సవాలు చేసిన అన్ని పిటిషన్లను కొట్టివేసింది. అయోధ్యలోని ధన్నీపూర్‌లో మసీదు నిర్మాణానికి యూపీ సర్కారు 5 ఎకరాల స్థలాన్ని కేటాయించింది.

తరువాత ఏడాదికి 2020 ఆగస్ట 5న అయోధ్యలో కోట్ల మంది ప్రజల ఆకాంక్ష నెరవేరడానికి బీజం పడింది. ప్రధానమంత్రి మోడీ మందిర నిర్మాణానికి భూమిపూజ చేశారు.



సరిగ్గా మూడేళ్లలో మందిర నిర్మాణం పూర్తయింది. దాదాపు 300 కోట్లతో అత్యద్భుతంగా నిర్మాణమైన ఈ ఆలయం మరో వెయ్యేండ్ల వరకు భూకంపం వచ్చినా చెక్కు చెదరదు. అడుగడుగునా, అణువణువునా రామతత్వం పుణికిపుచ్చుకొన్న రీతిలో అవతరిస్తున్న ఈ ఆలయ నిర్మాణంలో దాదాపు 1.75 లక్షల ఘనపుటడుగుల రాజస్థాన్ శాండ్‌స్టోన్ వాడారు. ఆలయ నిర్మాణంలో ఐరన్‌ను, సిమెంట్‌ను ఎక్కడా వాడలేదు. కేవలం రాతిపలకలను మాత్రమే వాడారు. గర్భగుడిలో ఏ మూల నుంచి చూసినా రాముడి రూపం కనిపించేలా అద్భుతంగా తీర్చిదిద్దారు. అయోధ్య రామమందిరాన్ని ఉత్తర, పశ్చిమ భారతదేశ ప్రాంతాల్లో ఉన్న సంప్రదాయాలను అనుసరించి నాగరశైలిలో నిర్మించారు. ఒకేసారి పది వేల మంది భక్తులు రాముల వారిని సందర్శించుకునేందుకు అవకాశం ఉంటుంది. సింహద్వారం ఏనుగులు, సింహాల ఆకృతులతో అందంగా తీర్చిదిద్దారు. ప్రధాన ఆలయం రాముడిది కాగా, సీతాదేవి, రాముడి ముగ్గురు సోదరులైన లక్ష్మణ, భరత, శతృఘ్నులకు, హనుమంతుడు, కృష్ణుడికి వేర్వేరుగా ఆలయాలు నిర్మించారు.

గోశాల, ధర్మశాలలతో పాటు నృత్యమండపం, రంగమండపం, కూడు మండపం, కీర్తన మండపం, ప్రార్థన మండపాలను నిర్మించారు. ఐదు గోపురాలు ఉన్న ప్రధాన ఆలయం ఇది. వేల ఏండ్లుగా ఈ దేశాన్ని ఏకత్రితం చేసినవాడు రాముడు. కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు భిన్న సంస్కృతులు, నాగరికతలు, జీవన విధానాలున్న దేశాన్ని ఒకటి చేసి నడిపిస్తున్న రాముడు ఇవాళ వనవాసం వీడి తిరిగి అయోధ్యకు చేరి పట్టాభిశక్తుడవుతున్నాడు. ఈ దేశానికి ఇది శుభ తరుణం.. శుభ సంకేతం.. రామం భజే శ్యామలం.. జై శ్రీరామ్. ❑

# మంచు దీవిలో పోస్టాఫీస్

**ప్రపంచానికి** అత్యంత సుదూరాన మంచుదీవిలో నడుస్తున్న ఏకైక పోస్టాఫీస్‌సు ఇది. అంటార్కిటికాలోని పోర్ట్‌లాక్రాయ్‌లో ఉన్న ఈ పోస్టాఫీసును యునైటెడ్ కింగ్‌డమ్ అంటార్కిక్ హెరిటేజ్ ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఇది కేవలం పోస్టాఫీసు మాత్రమే కాకుండా, మ్యూజియం కూడా. ప్రస్తుతం ఈ పోస్టాఫీసులో నాలుగు పోస్టుమాస్టర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టాఫీసు బాధ్యతలతోపాటు మ్యూజియం నిర్వహణను కూడా చూసుకోవాల్సి ఉంటుంది. వాటికి తోడు ఇక్కడ పెద్దసంఖ్యలో ఉండే పెంగ్విన్లను లెక్కించడం కూడా వారి బాధ్యతే. పెంగ్విన్లను లెక్కించడంలో నైపుణ్యం ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు అదనపు అర్హత. సుదూరంగా ఏకాంత ప్రదేశంలో ఉన్న ఈ పోస్టాఫీసులో పనిచేయడం ఏమంత ఆషామాషీగా ఉండదని, ఏటా నవంబరు నుంచి మార్చి వరకు పనిచేసే ఈ పోస్టాఫీసులో ఇక్కడి వాతావరణాన్ని తట్టుకుంటూ పనిచేయడమే కష్టమని యునైటెడ్ కింగ్‌డమ్ అంటార్కిటిక్ హెరిటేజ్ ట్రస్ట్ సీఈవో కామిలా నికోల్ తెలిపారు. ఇక్కడ రోజుకు 12 గంటలు పనిచేయాల్సి ఉంటుందని, ఇప్పటి వరకు తమ ప్రకటనకు స్పందనగా రెండున్నర వేలకుపైగానే దరఖాస్తులు వచ్చాయని, ఇక్కడి వాతావరణాన్ని తట్టుకుని పనిచేసే శారీరక దారుఢ్యం, శాస్త్ర పరిశోధనల కోసం ఇక్కడకు వచ్చే పర్యాటకులతో తగిన రీతిలో మెలిగే కలివిడితనం, ఓర్పు, సహనం ఉన్న అభ్యర్థుల కోసం చూస్తున్నామని చెప్పారు. ❑







# ఇత్తడి అందాలు




**పూజా** సామాగ్రే కాదు ఇప్పుడు సెంటర్ కన్సోల్ టేబుల్, సోఫా సెట్స్, కార్నర్ స్పేస్‌లలోనూ ఇత్తడి అందాలు ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఇంటిరియల్ పట్ల అత్యంత శ్రద్ధ కనబరచే వాళ్లు ఖరీదు గురించి పట్టించుకోకుండా ఇంటికి ఇత్తడి తెచ్చే కళకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇంటీరియల్ మోడర్న్ మెరుపు కావాలనుకుంటున్న వారు బ్రాస్‌వెస్ట్రన్ డిజైన్స్ పట్ల మక్కువ చూపుతున్నారు. ల్యాంప్స్, వాల్‌డెకర్ సెట్స్ మాత్రమే కాదు పార్టిషన్ వాల్స్, రూమ్ డివైడర్స్‌కీ బ్రాస్ మెటల్ డిజైన్స్‌నే ఎంచుకుంటున్నారు. అంతేకాదు ఇత్తడిని ఇతర లోహాలైన రాగి, వెండి, అల్యూమినియం వంటివాటితో జతేసి ఇంటి అలంకరణకు అదనపు సోయగాన్ని అద్దుతున్నారు.













# అరుదైన కలం

పసుపులేటి భాస్కరరావు

**మన** చరిత్రలో లిఖించబడని చేతి కళాకారులు కోకొల్లలు మన భారతదేశంలో ఉన్నారు. అలాంటి వారిలో కె.వి.రత్నంగారు ఒకరు. నేటి తరము వారికి చాలామందికి తెలియని ఇంకు కలము (ఇంకుపెన్ను). ఈ కలం స్వదేశీ రత్నం కల. జాతిపిత మహాత్మాగాంధి మన్నలను పొందిన చేతి కళాకారుడు, మన రాష్ట్ర గౌరవాన్ని దేశవిదేశాలకు విస్తరింపచేసిన మహాకళాకారుడు కె.వి.రత్నం. గోదారి ఒడ్డున రాజమండ్రి కోటమ్మగుమ్మం సెంటరు నుంచి రంగ్రేజుపేటలో ప్రవేశించిన తరువాత నాలుగు ఇళ్లు దాటగానే దాదాపు వంద సంవత్సరాలకు పైబడిన ఒక పెంకుటిల్లు ఇప్పటికీ దర్శన మిస్తుంది. ఆ ఇంటిలోపలికి వెళ్లగానే అందులో జాతిపిత మహాత్మాగాంధి స్వహస్తాలతో రాసిన లేఖ దర్శనమిస్తుంది.




ఆ లేఖ విశిష్టత ఏమిటంటే మహాత్మాగాంధి స్వహస్తాలో రాసిన 'రాత'కు మూలమైన ఓ కంపెనీ పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవలసినదే. ఈ స్వదేశీ కలము శ్రీకారం ఎలా జరిగిందంటే బ్రిటీషు కాలం నుంచి అప్పటిలో ఇంకుపెన్నులు విదేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిందే. తరువాత మన భారతదేశంలోనే పెన్ను తయారీదారులు పెన్ను విడిభాగాలను తెచ్చుకొని చెన్నపట్టణం, బొంబయి, కలకత్తాలలో తయారు చేసేవారు. రత్నం కలాలు తయారి ఒక కళగా మొదలైంది. ఒకసారి రాజమండ్రీలో సబ్‌జడ్జ్‌గా పనిచేయుచున్న శ్రీకృష్ణమాచార్యుల కలం కిందపడి పెన్ను పాళి (వెండి) చెడిపోయింది. ఆ రోజుల్లో పెన్నుపాళీని 14 క్యారెట్ల బంగారంతో తయారు చేసేవారు.



చెడిపోయిన ఆ పాళినీ ఆ సబ్‌జడ్జిగారు తనతో పని చేయుచున్న ఒక న్యాయవాది ద్వారా స్వర్ణకారులైన కె.వి.రత్నం, ఆయన సోదరుడు సత్యంకు ఇచ్చి దాన్ని బాగుచేయమని కోరగా వారు దానిని బాగు చేసిన తీరును చూచి కృష్ణమాచార్యులు ఆనందభరితులై పెన్నులు తయారీకి అవసరమైన సామగ్రిని సమకూర్చుటకు నేను సహకరిస్తాను అని చెప్పి పెన్నుల తయారీ ప్రారంభించమని ఆయన రత్నంకు సలహా ఇచ్చాడు. కృష్ణమాచార్యుల సలహా మేరకు 1932లో రత్నం, ఆయన సోదరుడు సత్యం తన సొంత పెంకుటింటిలోనే పెన్నులు తయారీ ప్రారంభించి అదే సంవత్సరంలో మార్కెట్టులోకి పెన్నులను విడుదల చేశారు. అప్పటిలో వాటిని అందరూ 'స్వదేశీకలాలు'గా పిలిచే వారు. తరువాత 1935వ సంవత్సరం మహాత్మాగాంధీ తూర్పుగోదావరి జిల్లాల పర్యటనలలో, గోదారి రైల్వేస్టేషన్‌లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించే సమయంలో కె.వి.రత్నం 14 క్యారెట్ల బంగారంతో బిగించిన కలాన్ని ఆయనకు బహుకరించినారు. దానిని చూచిన మహాత్ముడు మొదట నమ్మలేక తరువాత తన సహాయకుడు కుమారప్పను పంపి వారు తయారు చేయు ఇంటిని, వారి సామగ్రిని చూచి రమ్మని చెప్పారు. కుమారప్ప వాళ్ల ఇంటిని, సామగ్రిని చూసి మహాత్మాగాంధీకి అన్ని విషయాలు కూలంకాషంగా వివరించగా ఆనందభరితుడైన బాపూజీ తన స్వహస్తాలతో ఇంగ్లీషులో రత్నంగారికి ఒక ఉత్తర్వును రాయడమైనది.




మహాత్మాగాంధి లేఖ సారాంశం

**ప్రియమైన రత్నం,**

కుమారప్పద్వారా నాకు పౌంటెన్ పంపించినందుకు మీకు తప్పకుండా కృతజ్ఞతలు చెప్పాలి. ఆ పెను వాడి చూశాను, బజార్లో దొరికే విదేశీ కలాలకు ఇది మంచి ప్రత్యామ్నాయం.

మీ విశ్వసనీయుడు

**ఎం.కె.గాంధి.**

ఇప్పటికీ ఈ పెన్నులను వంశపారంపర్యంగా వారి కుటుంబ సభ్యులే తయారుచేస్తున్నారు. రోజుకు 7,8 పెన్నుల కన్నా ఎక్కువ తయారు చేయలేరు. ప్రస్తుతం ఒక పెన్ను ఖరీదు ప్రారంభ ధర రెండు వేల రూపాయలు, ఆర్డర్లను బట్టి, పదివేల నుంచి లక్ష రూపాయల వరకు పెన్నులు తయారు చేయగలరు. ❑

ఈవారం కవిత్వం



# ప్రేమ వర్ణాల ఇంద్రచాపం

నీ తలపు మకరందం/ పూల కనురెప్పలపై
తేనెటీగనై గిరికీలు కొడుతూ నేను./ నీ పిలుపు మిఠాయి
మూట/
గుండె గండు చీమల పుట్టలో
పంచదార బిళ్లనై రుచిగొంటూ నేను.
నీ చూపు కొనకంటి మెరుపు
లిపి దిద్దుకునే కొత్తభాషకు
వేళ్లకొసల్లో మూగ సైగనై నేను.
నీ రూపు హృదయ కమలపు
ఛాయ
ప్రియమార పొలిచిన
నీలిదీప్తుల అంచుల్లో కెంజాయ
నేను.
నీ ఊపిరి కొండగాలి మలుపు
ముఖాన్ని ముంచెత్తే నునుపు కురుల్లో
దూదిపింజెనై మోగే వేణువు
నేను.
నీది సోగకన్నుల
ధ్యానముద్ర
నాది విరామమెరుగని కలల నిద్ర
అక్షరాలా నేను నీకు నిత్య సహవాసి,
నీవు నా భవిష్య జన్మల పురాప్రేయసి.
కాలం కళ్లెదుట భ్రమణ గోళమై నేను
రేయింబవళ్లుగా నిత్యమై నా చుట్టూ నీవు
మన ధగధగ నవ్వుల మీదుగా
ప్రేమ వర్ణాల ఇంద్రచాపం.

**- కంచరాన భుజంగరావు**

# నీవేగా మనసా!



**మౌనంలో**
మాటది ఒంటరితనం
గొంతుది ఏకాంతం.
కనిపించని మనసు
కలలో ఎదురుపడినా
చూడలేని చిన్నతనమేదో
ఊహించని ఊహకు చిక్కి
ఊపిరాడక నిజమై
ఉవ్వెత్తున కెరటమై
భాష లేని భావంగా
ఎద తీరానికి కొట్టుకొస్తుంటే
కోతకు గురయ్యే కోరికలు
నిద్ర ముసురులో
మగత ముడతల్లో
ఒళ్లు విరుచుకుని
కలవరింత
గొంతు సవరించుకున్న
కల నీవేగా మనసా!


**- సుభాషిణి వి.**

# మహిళా శిఖరం

అందమైన ప్రకృతితో పోల్చగలిగే ఆకృతి
గృహసీమను బాధ్యతాయుతంగా పరిపాలిస్తున్న
సామాజిక రంగాలల్లో రాణిస్తున్న అలుపెరగని అతివ!
దాసీ జీవితం నుండి విముక్తిని పొంది
అద్భుతమైన ఆలోచనలతో ఉన్నత శిఖరాలను
అధిరోహించగలిగే స్థాయిని అందుకున్న ధైర్యశాలి!
ప్రథమ ఉపాధ్యాయినిగా తనయులను
సంస్కారవంతులుగా తీర్చిదిద్దగలిగే స్త్రీ మూర్తి!

అన్ని రంగాలల్లో అష్టావధానం చేస్తూ
అందరికీ స్ఫూర్తిగా నిలిచిన మకుటం లేని మహారాణి!
జీవితమంతా బాధ్యతల బంధాలతో పరుగులు తీసే వీరనారి
ఓ మహిళామణీ! మీకు వేనోళ్ల పలుకుతున్నాం వందనాలు
మీ పాదాలకు చేస్తున్నాం ప్రణామాలు.

**- ప్రశాంతలక్ష్మి**



# పుస్తక సమీక్ష




## ఆనందాన్ని కలుగజేసే కథలు

కథలెవరు చెబుతారు? అమ్మలు చెబుతారు. ఆరు బయట వెన్నెల్లో నాడు అమ్మమ్మలు, నానమ్మలు, తాతయ్య చెప్పేవారు. నేటి పిల్లలకు 'గూగులమ్మ' చెబుతుంది. ఏతావాతా, చెప్పొచ్చేదేమంటే కథలు శ్రేయోభిలాషులు చెబుతారు. 'కథల్లో ఉండేదేమిటి?' అన్న ప్రశ్నకు మంచి దారిన నడవమని ప్రత్యక్షంగానో పరోక్షంగానో చెబుతాయి. రామాయణ మహాభారతాల కాలం నుండి మనకు కథలు వస్తున్నాయి. తర్వాతి కాలంలో గోపీచంద్ కొడువటిగంటి పాలగుమ్మి వంటి వాళ్లు చెప్పారు. అలాంటి కథకుల దోవలోనే నడవాలన్న సత్ప్రయత్నం శ్రీవిజయానంద్ దెందులూరిగారిది. 'ఆనందు కథలు' అన్న 25 కథల సంపుటితో మన ముందుకు వచ్చారు. కథల్లోకి వెళ్తే నిరుద్యోగం అద్దెగదీ, నెలనెలా అద్దె చెల్లించేందుకు పడే అవస్థలు మధ్య తరగతి వారందరకూ తెలుసు. అద్దె ఇవ్వనవసరం లేని గదీ, ఇల్లుగలాయన అమ్మాయే లభిస్తే, ఆ ఆనందమే వేరు. అదే చూపించారు 'అద్దెగది' కథలో..నేలమీద నడిచే బ్రతుకులకు విమానంలో ప్రయాణం చేయటం ఓ 'గగన కుసుమం'. గోపన్న రంగమ్మలు హరిశ్చంద్ర ప్రసాద్ అనే భూస్వామి ఇంట్లో పనిమనుషులు. రంగమ్మకు విమానం ఎక్కిగాల్లో ఎగరాలన్న కోరిక. ఆమె కోరిక భర్త ద్వారా కాకుండా కొడుకు ప్రసాద్ ద్వారా తీరుతుంది. అదెలాగో 'అమ్మకిచ్చిన మాట' చదవాల్సిందే. సంపుటిలోని అన్ని కథలు 'ఆనందం' కలిగించేవే.

**(ఆనందు కథలు, రచన: విజయానంద్ దెందులూరి, వెల: 150, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**- కూర చిదంబరం**

## 'వెన్నెల జలపాతంలోని అక్షర పుష్పాలు'



కవయిత్రి తన అత్తమామలైన ఇల్లెందుల నరసింహా రావు, సుబ్బలక్ష్మి దంపతులకు ఈ కవితా సంపుటి అంకితం చేసారు. గంటి భానుమతి చక్కటి ముందుమాట రాసారు. దాదాపు 51 కవితలున్నాయి. నా హృది నుండి మీ మదికి అంటూ చక్కటి భావాలతో మానవ సంబంధాలు, అతివల ఈతిబాధలు, పర్యావరణం, పంచభూతాలు, మానవతావాదం, తండ్రి స్మృతి, అమ్మ గురించి ఇలా వస్తు ఎంపిక భావాల శిల్ప సందపతో రాసిన చాలా కవితలు పాఠకుల్ని చివరి కవితదాకా చదివిస్తాయి. మచ్చుకు కొన్ని చూద్దాం. 'నా ఆకలి తీర్చడానికి, తన ఆకలి చంపుకున్నప్పుడు/ కనిపించింది ఆ ఉదర సౌందర్యం.../ నన్నే తన సర్వస్వం అనుకొంటూ,/ తన జీవితాన్నే త్యాగం చేసిన, /చేస్తున్న ఆ హృదయ సౌందర్యం ముందు, /నా అందం వెలవెలబోతున్నట్లనిపించింది..అంటూ అమ్మపై రాసారు(పేజీ: 12). 'పాతబడిన కొద్దీ తగ్గుతుంది ప్రతిదాని విలువ/ కానీ పాతబడిన కొద్దీ మరింత పరిమళిస్తుంది స్నేహమనే కలువ' అంటారు 'స్నేహం' కవితలో (పేజీ 36). 'పేద, గొప్ప బేధమేమీ లేక సమభావాన్ని చూపేటి బావి/ మగవారికి రచ్చబండలాగా, ఆడవారికి సమావేశ ప్రదేశమీ బావి (పేజీ.94) అంటారు ఊరి బావి కవితలో. అన్నీ అద్భుత కవితలుగా అక్షరీకరించిన ఉమాదేవి మరిన్ని మంచి కవితలు రాయాలని ఆశిద్దాం.

**(వెన్నెల జలపాతం, రచన: ఉమాదేవి ఇల్లెందుల, వెల: రూ 100, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**- తంగిరాల చక్రవర్తి**

## 'రహదారి'- కొరుప్రోలు హరనాథ్ కవితా సంపుటి

'ఆకురాలు దృశ్యం చూసినప్పుడల్లా జీవిత గ్రంథం నుండి ఓ వత్సరపు పేజీ చినిగిపోతున్న చిన్నశబ్దం' అంటూ కొరుప్రోలు హరినాథ్ ఆకులు రాల్చే దృశ్యాన్ని కవితా హృదయంతో స్పృశించి జీవన సృష్టిగీతాన్ని ఆలపించారు. 'రహదారి' కవితా సంపుటిలో 55 కవితలు, వైవిధ్య ఇతివృత్తాలతో, వివిధ సందర్భాలలో ప్రచురింపబడినవి వున్నాయి. బాల్యం గుర్తుచేసు కుంటూ 'కట్టెలపొయ్యిపై అన్నం ఉడుకుతుంటే అమ్మ', 'పోరాటం




అంటే నడులనే కాదు ఎడారుల్ని ఈదటం', 'రుధిరపు చుక్కలు ఇసుక రేణువుల దాహం తీర్చడం', 'మర్మ లోయల్లోకి జారిపోతున్నప్పుడు ఏ ఊడల్ని పట్టు కోకు' వంటి వాక్యప్రయోగాలు కవి ప్రతిభను వ్యక్తం చేస్తున్నాయి. మానవుడు విశ్వమానవుడై శాంతి కోసం ముందుకు నడవాలని అదే తన కవితా సందేశంగా శాంతి కోసం, శాంతి సుమాలు, శాంతిలోకాలకు వంటి కవితలున్నాయి. 'కవిత్వమే నేను'లో తానే కవిత్వంగా తాదాత్మ్యం చెందడం స్పష్టమవుతుంది. విశ్వవేదికపై ప్రపంచగీతికను ఆలపిస్తూ మానవాభ్యుదయం వైపు పురోగమించే, ప్రేమపుష్పాలను భూగోళంపై వెదజల్లే భావోత్తేజంతో, ప్రేమ పుష్పాలను భూగోళంపై వెదజల్లే భావోత్తేజంతో, కొరుప్రోలు హరనాథ్, రహదారి కవితా సంపుటిలో అభ్యుదయ ప్రస్థావనలో కృతకృత్యత సాధించారు. అభినందనీయులు.

**(రహదారి, రచన: కొరుప్రోలు హరనాథ్, వెల: రూ 130, ప్రతులకు: ప్లాట్ నం.14, రోడ్ నం.1, ధర్మపురికాలనీ, లింగోజిగూడ,** సరూర్‌నగర్, హైదరాబాద్) **- యర్రమిల్లి**

## నాంపల్లి సుజాత కవిత్వం 'హోమ్ మేకర్'

అభ్యుదయ భావాలు నరనరాన జీర్ణించుకున్న వర్ధమాన కవయిత్రి నాంపల్లి సుజాత వెలువరించిన అయిదవ కవిత్వపొత్తం 'హోమ్ మేకర్'. స్త్రీని 'హౌస్ వైఫ్', 'హోం మేకర్' అనడం తనకు నచ్చదు అంటూనే తన గ్రంథాన్ని 'హోమ్ మేకర్' అని



నామకరణం గావించడం గమనార్హం. సగటు స్త్రీ సమస్యలు, ఈతిబాధలు, హరించుకుపోతున్న హక్కులు చర్చిస్తూనే పరిష్కార దిశగా సూచనలు చేస్తు కవితలు అల్లారు నాంపల్లి సుజాత. స్త్రీలోని ఔన్నత్యాన్ని, సహనాన్ని, తాగ్యనిరతినీ చాలా కవితల్లో ప్రస్ఫుటంగా చర్చించారు. 'సొంతూరు' కబుర్లు చెప్పు, సిద్దిపేట వెళ్లేదారిలో 'ప్రజ్ఞాపూర్' బస్టాండులో మక్కకంకుల పరిమళాలను పంచుతూ, 'పోపులపెట్టె'లోని దినుసుల వర్ణన చేస్తు, 'కత్తెర', 'బిరడా' వంటి వస్తువుల్ని కవిత్వీకరిస్తు, 'భూదాన్ పోచం పల్లి', 'రామప్ప', 'వీరబైరాన్‌పల్లి', 'మున్నూర్' అందాలను వర్ణిస్తు తన కవితలతో పాఠకులను అలరిస్తారు కవయిత్రి. 'వితంతు తంతు' ఆలోచనలను రేకెత్తించే మంచి కవిత. 'కనబడదుగానీ..ఈ బుజ్జి విత్తనం/ చీకటి పొరలను చీల్చుకొచ్చి/ తల్లిపాదాలకు గొడుగు పడుతుంది' వంటి అద్భుత కవిత్వ పంక్తుల్ని కవితల్నిండా ఆస్వా దించవచ్చు. 'స్వవుజ్' ఓ మంచి కవిత. గ్రంథ శీర్షికకు బాగుంటుం దేమో కవయిత్రి ఆలోచించి వుండాల్సింది. **(హోమ్ మేకర్, రచన: నాంపల్లి సుజాత, వెల: రూ 100, ప్రతులకు: ఇ.నం.3-13-105/2, రామంతాపూర్, హైదరాబాద్) - రమణ వెలమకన్ని**

# మార్కెట్లో కొత్తగా..



## బెస్ట్ మేకర్

అనుకుంటాంగాని బ్రేక్‌ఫస్ట్ పెద్ద టాస్కే. ఆ టాస్క్‌ని ఈజీ చేస్తుంది ఈ మల్టీ మేకర్. ఒకేసారి మూడు వెరైటీలను రెడీ చేయగలదు. హెల్దీ సిరామిక్ నాన్‌స్టిక్ డ్యూయర్ గ్రిడిల్స్, 2 స్టెస్‌టోస్ట్ సొరుగులతో రూపొందిన ఈ డివైస్ వినియోగించడానికి చాలా సులభంగా ఉంటుంది. బ్రెడ్ టోస్టింగ్, వెజిటబుల్ కుకింగ్, మీట్ గ్రిలింగ్‌లతోపాటు ఆమ్లెట్స్, పాన్‌కేక్స్ వంటివన్నీ ఇందులో రెడీ చేసుకోవచ్చు. పైనరెండుభాగాల్లో కుక్ చేసుకోవచ్చు. అలాగే కింద సొరుగులో టోస్ట్ చేసుకోవచ్చు. రెగ్యులేటర్‌ని అడ్జస్ట్ చేసుకుంటే దీని వినియోగం ఈజీగా ఉంటుంది.

## పోర్టబుల్ ట్రావెల్ కెటిల్

పోర్టబుల్ ట్రావెల్ కెటిల్ మెనీ రుచులను అందిస్తున్నది. 400 మిల్లీలీటర్ల సామర్థ్యం కలిగిన ఈ డివైస్ చిన్నగా, సౌకర్యవంతంగా ఉంటుంది. దాంతో దీన్ని ట్రావెలింగ్‌కి వెళ్లినప్పుడు..హాస్టల్స్ లో ఆఫీసుల్లో సులభంగా వాడుకోవచ్చు. అందులో టీ, కాఫీలతోపాటు సూప్స్, ఓట్‌మీల్, నూడుల్స్ వంటివన్నీ రెడీ చేసుకోవచ్చు. సిలికాన్ గ్లాస్‌లిడ్ (మూత), సిరామిక్ గ్లేజ్ కోటింగ్, ఎర్గొనామిక్ హ్యాండిల్‌తో రూపొందిన ఈ మేకర్‌ని యూజ్ చేయడం చాలా ఈజీ. క్లీన్ చేసుకోవడమూ అంతే ఈజీ. డివైస్ ముందువైపు కింద ఇండికేటర్ లైట్‌తోపాటు..పవర్ ఆన్ లేదా ఆఫ్ బటన్స్ ఉంటాయి. ఇందులో 113 డిగ్రీలు, 140 డిగ్రీలుచ 212 డిగ్రీల ఫారెన్‌హీట్‌తో 30 మినిట్స్, 60 మినిట్స్, 90 నిమిట్స్ టైమర్ ఆప్షన్స్ ఉంటాయి. దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు.



## ఎలక్ట్రిక్ మగ్ వార్మర్



ఈ మగ్‌వార్మర్ ఉద్యోగస్తులకు భలే ఉపయోగపడుతుంది. టీ, కాఫీ, పాలు, నీళ్లు, సూప్స్, పాస్తా, పాయసం ఇలా చాలా వాటిని దీనిపై వేడి చేసుకోవచ్చు. ఫోర్‌మోడ్స్, ఫైన్ టెంపరేచర్ సెట్టింగ్స్, సిక్స్ లెవెల్స్ టైమర్‌తో ఇది పని చేస్తుంది. 104 డిగ్రీల ఫారెన్‌హీట్ నుంచి 185 డిగ్రీల ఫారెన్‌హీట్ వరకు టెంపరేచర్‌ను అడ్జస్ట్ చేసుకోవచ్చు. ఈ పోర్టబుల్ వార్మర్‌లో 2 గంటల నుంచి 12 గంటల మధ్య టైమింగ్‌ని సెట్ చేసుకోవచ్చు. అయితే టైమింగ్ సెట్ చేసుకోకపోయినా ఆటోమేటిక్ మోడ్‌లో 8 గంటల పాటు వార్మర్ పని చేస్తుంది. దీని ఇంటెలిజెంట్ టెంపరేచర్ కంట్రోల్..గ్లాస్, సిరామిక్, స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి మెటీరియల్‌తో రూపొందిన బౌల్స్ లేదా బాటిల్స్‌కి అనువుగా ఉంటుంది.

# వింటర్ స్నాక్స్

## స్వీట్‌కార్న్ వడలు

**కావలసినవి:** లేత స్వీట్‌కార్న్ గింజలు–రెండుకప్పులు, లేక తోటకూర ఆకులు–రెండు కప్పులు, అల్లం–కొద్దిగా, వెల్లుల్లిరెమ్మలు–7, ఉప్పు–తగినంత, జీలకర్ర–ఒక స్పూన్, సోంపు– అరటీస్పూన్, ఉల్లిపాయ ముక్కలు– అరకప్పు, బియ్యప్పిండి–పావుకప్పు, పచ్చిమిర్చి–4, నూనె–సరిపడా.



### తయారీ విధానం

ముందుగా మిక్సీలో స్వీట్‌కార్న్, వెల్లుల్లిరెమ్మలు, అల్లం, తోటకూర ఆకులు బరకగా మిక్సీ పట్టుకోవాలి. అవసరం అయితే కొన్ని నీళ్లు కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని ఒక బౌల్లోకి తీసుకుని, జీలకర్ర, సోంపు, బియ్యప్పిండి, ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. మిశ్రమం మరీ జారుగా మారితే కాస్త బియ్యప్పిండిని వేసుకోండి. చిన్న చిన్న వడల్ల చేసుకుని, నూనెలో దోరగా వేయించుకోవాలి.

## మీల్‌మేకర్ స్టఫ్డ్ చపాతీ



**కావలసినవి**

మీల్‌మేకర్–పావుకప్పు (మెత్తగా ఉడికించుకోవాలి), గోధుమపిండి– ఒకటిన్నర కప్పులు, వేడినీళ్లు, నూనె–సరిపడా, మొక్కజొన్నపిండి–2, టేబుల్‌స్పూన్, ఉప్పు–తగినంత, ఉల్లిపాయ ముక్కలు–2, పచ్చిమిర్చి ముక్కలు–1, టీస్పూన్, పసుపు–చిటికెడు, కారం–1టీస్పూన్, అల్లం, వెల్లుల్లి పేస్ట్–అరటేబుల్ స్పూన్, టొమాటో ముక్కలు–1 టేబుల్ స్పూన్, కరివేపాకు, కొత్తిమీర తురుము–కొద్దిగా.

**తయారీ విధానం**

ముందుగా గోధుమపిండి, మొక్కజొన్నపిండి, మూడు గరిటెల నూనె, ఉప్పు ఒకదాని తర్వాత ఒకటి వేసుకుని కొద్దికొద్దిగా వేడినీళ్లు పోసుకుంటూ ముద్దలా చేసుకుని, తడిగుడ్డ పరచి 20 నిమిషాల పాటు పక్కనపెట్టుకోవాలి. ఈలోపు ఒక కళాయిలో 2 గరిటెల నూనె వేసుకుని, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలను దోరగా వేయించుకుని, మీల్‌మేకర్ తరుమును వేసుకుని బాగా కలపాలి. అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి బాగా కలిపి, పసుపు, కారం, ఉప్పు, టొమాటో ముక్కలు వేసి తప్పుడూ బాగా ఉడికించుకోవాలి. చివరగా కరివేపాకు, కొత్తిమీర తురుము వేసుకుని స్టవ్‌ఆఫ్ చేసుకుని, ఒక్కోదానిలో కొద్దికొద్దిగా మీల్‌మేకర్ మిశ్రమాన్ని పెట్టుకుని ఫోర్డ్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి. వీటిని వేడివేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి.



## వాల్‌నట్ హాల్వా

**కావలసినవి**

వాల్‌నట్–కప్పు, యాలకులపొడి–పావుస్పూను, కేసరి–అయిదు రేకులు, నెయ్యి–పావుకపు , పాలు–ముప్పావు కప్పు, చక్కెర–అరకప్పు.

**తయారీ విధానం**

పాన్‌లో వాల్‌నట్స్‌ను తక్కువ మంట మీద వేయించాలి. నట్స్ రంగు మారాక స్టౌవ్ కట్టేయాలి. పూర్తిగా చల్లబడ్డాక మిక్సీలో వేసి పౌడర్‌లా చేసుకోవాలి. పెద్దబాణలిలో నెయ్యిని కరిగించి వాల్‌నట్ పౌడర్‌ను వేసి కలపాలి. ఆ తరువాత పాలు, చక్కెర, కేసరి రేకుల్ని వేసి మరిగించాలి. పదిహేను నిమిషాల తర్వాత అంతా దగ్గరగా అవుతుంది. నెయ్యి పూసిన పళ్లెంలోకి ఈ మిశ్రమాన్ని వేయాలి. పైన కొన్ని వాల్‌నట్స్‌ను అలంకరించుకోవాలి. కాసేపు అలాగే వదిలేస్తే మంచిది. ఆ తరువాత కావలసిన ఆకారంలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. ❑



కథ

# వడ విసిరితే..

రామేశ్వరంలో అతిప్రాచీనమైన రామనాథస్వామి దేవాలయం ఉంది. అది బంగాళాఖాతం సముద్రతీరంలో ఉంది. జీవనోపాధి కోసం శర్వి అనే పిల్లవాడి అమ్మ, దేవాలయం దగ్గర, సముద్రతీరంలో వడల అంగడి ప్రారంభించింది. అయిదు చదివే శర్వి తీరిక సమయాల్లో వడలు అమ్మడానికి కూర్చునేవాడు.



వ్యాపారం బాగా జరిగితే, ఉన్న కొద్దిపాటి అప్పులు తీరిపోతాయని శర్వి అమ్మ భావించింది. అయితే వ్యాపారం సరిగా జరగలేదు. పెట్టిన పెట్టుబడికి సరైన ఆదాయం రాక నష్టాలు ప్రారంభం అయ్యాయి. వ్యాపారం సరిగా జరగకపోవడంతోపాటు వారి వ్యాపారానికి కాకుల బెడద కూడా తోడయ్యింది.

చేసి పెట్టిన వడల గంప పైకి, కాకులు తుర్రుమని వచ్చి వడలను ఎగరేసుకుపోయేవి. అమ్మ బాధ చూడలేని శర్వి పెద్దకర్ర ఒకటి చేతబట్టుకుని దాని చివర గుడ్డకట్టి కాకుల్ని తరిమేవాడు. అవి వెళ్లినట్లే వెళ్లి సమయం చూసి వడలను ముక్కుతో పట్టుకుని వెళ్లేవి. ఒకరోజు శర్వి చేతిలోని కర్రతో కాకుల్ని తరుముతూ ఉంటే వడ ఒకటి కర్రగుడ్డకి తగులుకుని ఆకాశంలోకి ఎగిరింది. అలా ఎగిరిన వడను ఒక కాకి లటుక్కున పట్టుకుని సర్రున ఆకాశంలోకి తుర్రుమంది.

'ఇదేదో తమాషాగా ఉందే..' అనుకున్నాడు శర్వి. మరుసటిరోజు 'ఏమి జరుగుతుందో చూద్దామని' ఒక వడ ఆకాశంలోకి విసిరివేశాడు. దుర్రున వచ్చిన కాకి శర్వి చూస్తుండగానే తన్నుకుపోయింది. దాన్ని చూసిన శర్వికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. మరుసటి రోజున అమ్మని గంప దగ్గర కూర్చోని వడలను అమ్మమన్నాడు. తనేమో పక్కనే ఉన్న కొబ్బరి చెట్టుకింద కూర్చున్నాడు. కొన్ని వడలను చిన్నచిన్న ముక్కలుగా చేసి అరటి ఆకులో పెట్టుకుని ఒక్కో ముక్కను ఆకాశంలోకి విసిరివేయసాగాడు. ఎక్కడెక్కడి కాకులో సర్రుసర్రున వచ్చి శర్వి విసిరే వడ ముక్కలను ముక్కుతో టక్కున పట్టుకుని వెళ్లిపోయేవి. శర్వి ఆకాశంలోకి వడ ముక్కలను విసిరివేయడం, అతిలాఘవంగా అవి ముక్కుతో టక్కున పట్టుకుని వెళ్లిపోయేవి. శర్వి ఆకాశంలోకి వడ ముక్కలని విసిరి వేయడం, అతి లాఘవంగా అవి ముక్కుతో పట్టుకోవడం చూపరులను విశేషంగా ఆకర్షించేది.

దీంతో గుంపులు గుంపులుగా యాత్రికులు వచ్చి కొబ్బరి చెట్టు వద్ద చేరేవారు. 'ఎప్పుడు శర్వి వడలు విసురుతాడా, కాకులు ఎప్పుడు వచ్చి వాటిని తన్నుకుపోతాయా..'అని ఆసక్తిగా ఎదురు చూసేవారు. అలా చూడటానికి వచ్చినవారు చిన్నగా వడలను కొని తింటూ ఈ వింతను చూసి ఆనందించేవారు. తాము కూడా కొన్ని వడలు కొని కాకులపైకి విసిరేవారు. వడలు చాలా కమ్మగానూ, రుచిగానూ ఉండటంతో విషయం ఆనోటా ఈనోటా ప్రాకి వడలకోసం జనం బారులు తీరి నిలబడేవారు.

కొన్ని రోజులకి కాకులు, అమ్మ అమ్మే వడ గంప దగ్గరకు రావడం తగ్గించాయి. శర్వి విసిరే వడలకే అలవాటు పడ్డాయి. వ్యాపారం జోరు అందుకుంది. వ్యాపారంలో మంచి లాభాలు రావడంతో అప్పులన్నీ తీర్చేశారు. ఆ శుభ సందర్భాన శర్వికి వాడి అమ్మ వేడివేడి నేతివడలు చేసి తినిపించింది.

**- ఆర్.సి.కృష్ణస్వామి రాజు**

వార్త ఆదివారం

## బాలగేయం

### హలం-కలం



హలం దున్నే రైతన్న
కలం పట్టి రాయన్న
అలుకు మొలకలను
అక్షరాలుగా మార్చన్న
పొలంబడిలో రాజోలె
అక్షర సేద్యం చేయన్న
కష్టనష్టాలు ఎదురైనా
వెన్ను చూపకు ఓ అన్న
ఆరుగాలం పంట కోసం
అహోరాత్రులు చదువన్న
మధుర పద్యాల పొలంలో
మణిదీపమై వెలుగన్న
రామసక్కని గాలిపటమై
రాజోలె జగతిపై ఎగురన్న.

**- దుర్గమ్ భైతి**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.కార్తికేయన్,** ధర్మస్థల

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. క్రికెట్‌కు ఆ పేరు ఎలా వచ్చింది?**

**జవాబు: కార్తికేయన్!** తొలినాళ్లలో ఆడిన క్రికెట్‌లో రెండు చిన్న స్టంప్స్‌ను అమర్చి బ్యాట్స్‌మన్ మోకాలి మీద కూర్చొని, విసిరిన బంతిని ఎదుర్కొనేవాడు. ఫ్రెంచి భాషలో 'క్రిక్' అంటే కర్ర. 'క్రిక్‌స్టోల్' అంటే చర్చిలో మోకాలి మీద కూర్చోవడం. ఈ పదాల ఆధారంగా ఈ ఆటను ఫ్రెంచ్‌లో 'క్రికెల్' అని పిలిచేవారు. ఇంగ్లండ్‌లో ఈ ఆట ప్రవేశించిన తదనంతరం 'క్రికెట్'గా పిలవనారంభించారు. క్రిక్, క్రిస్‌లకు ఇంగ్లిష్‌లో క్రచ్/స్టఫ్ లేదా గట్టిదనం అనే అర్థాలు ఉన్నాయి. ఇంగ్లండ్‌లోనే క్రికెట్ గణనీయమైన స్థాయిలో జవసత్వాలు పుంజుకోవడం వలన బ్రిటన్‌లు పిలిచిన పేరు ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడింది.

**- పి.ఏకాదశి,** గుంటూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వేలుముద్రలతో పోలీసులు ఎలా పరిశోధన చేస్తారు?**

**జవాబు: ఏకాదశి!** నేరం జరిగిన వెంటనే నేరస్థలాన్ని పరిశీలించిన 'క్లూస్ టీమ్' సభ్యులు ముందుగా అక్కడి వేలిముద్రలను సేకరిస్తారు. ఆ తరువాత నేరం జరిగిన ఇంటి కుటుంబ సభ్యుల వేలిముద్రలను తీసుకుంటారు. వాటిని పోలుస్తారు. ఘటనా స్థలంలో కొత్త వేలిముద్రలు కనిపిస్తే వాటిని కంప్యూటర్‌లో పొందుపరిచి పాత నేరస్తుల వేలిముద్రలతో పోలుస్తారు. తద్వారా నేరస్తులను గుర్తిస్తారు. ఆధారాలు ఉంటే డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందిస్తారు. ఇక, వేలిముద్రలకు గల పరిమితులను పరిశీలిస్తే- నున్నటి తాళం మీద మాత్రమే ముద్రలు పడతాయి. గరుకు తాళాల మీద వేలిముద్రలను తీయడం అసాధ్యం; చేతులకు గ్లౌజులు వాడితే ముద్రలు పడవు; చేతి ముద్రలను తుడిచివేస్తే ఉపయోగం ఉండదు. వీటిని దృష్టిలో ఉంచుకునే పోలీసులు వేలిముద్రల ద్వారా నేరస్తుల ఆచూకీని కనిపెట్టడానికి ఆలోచిస్తుంటారు.



# ఔషధం-సుగంధం 'దాల్చిన' చెక్క

తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

**మసాలాకూరల్లో దాల్చిన చెక్క లేకపోతే వంటకు రుచిరాదు. దక్షిణ భారతదేశంలో దీని ఆదరణ మరీ ఎక్కువ. కేరళలో పండించే సుంగధ ద్రవ్యాల పంటల్లో దాల్చిన చెక్కకు ప్రత్యేకస్థానం ఉంటుంది. అయితే ఇది సుగంధద్రవ్యంగానే కాదు ఔషధపరంగా కూడా దీనిలో పుష్కలమైన గుణాలున్నాయి.**

దాల్చిన చెట్టు బెరడు నుంచి వచ్చిన పట్టను ఎండబెట్టి దాల్చిన చెక్క పేరుతో మార్కెట్లో అమ్ముతుంటారు. మనదేశంలో దొరికే దాల్చిన చెక్క రకం పేరు 'తమాలా'. మలబారు తీరం దీని పుట్టినిల్లు. దాల్చినచెక్క ప్రాచీన కాలం నుండి అత్యంత ఇష్టంగా వాడబడుతోన్న సుగంధద్రవ్యం. క్రీ.పూ. 2000నాటి కాలంలో ఈజిప్టులో దాల్చినచెక్క వాడకం



అధికంగా ఉండేదట. దీని పుట్టుకపై స్పష్టమైన ఆధారాలు లేవుకానీ చైనాలో పుట్టిందని, కాదూ కాదు శ్రీలంకలో పుట్టిందని అందుకే భారతదేశంలోకి త్వరగా రాగలిగిందని పరిశోధకుల వాదనలు ఉన్నాయి. ప్రాచీన కాలంలో దీనిని కానుకలా ఉపయోగించేవారట. దాల్చినచెక్కలను కానుకగా ఇచ్చి దేవతల మొక్కులు చెల్లించుకునేవారట. దాల్చినచెక్కలను కానుకగా ఇచ్చి దేవతల మొక్కులు చెల్లించుకునేవారట. ఆ సంప్రదాయం ఎక్కువగా ఉన్న రోమన్లు, గ్రీకు ప్రజల్లో ఉండేదని చరిత్ర చెబుతోంది. దీన్ని ప్రసాదంగా భావించేవారు కాబట్టి దీన్ని వంటల్లో ఉపయోగించేవారు కాదట. అందుకని వంటల్లో దీని ఉపయోగంపై కొన్ని సంవత్సరాలపాటు నిషేధం విధించారు. అయితే దీన్ని తొలిసారి వంటల్లో వాడిన ఘనత మాత్రం చైనాదేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ మొక్క ఎత్తైన కొండల్లో పెరుగుతుంది. బెంగాళ్, అస్సాం వంటి కొన్ని ప్రదేశాలలో సాగుచేస్తారు. వీటి ఆకులు, దళసరిగా, పెళుసుగా ఉంటాయి. ఈ చెట్టు ఆరుమీటర్ల నుంచి ఎనిమిది మీటర్ల వరకూ పెరుగుతుంది. చిన్నచిన్న పువ్వులు గుత్తులు గుత్తులుగా ఉంటాయి. ఈ చెట్టు తాలూకు కొమ్మలను నరికి, బెరడును ఒలిచి ఎండబెడతారు. ఈ మొక్క ఆకుల నుంచి తీసిన నూనె ఎంతో పరిమళాన్ని కలిగి ఉండి స్వీట్స్ తయారీలోను, సబ్బులు, క్రీములు వగైరాల్లోనూ, టీ తయారీలో, బేకరీ ఉత్పత్తులలో, శీతల పానీయాలలో, ఓట్‌మీల్, టోస్ట్, టీ లేదా కాఫీ, హాట్ చాక్లెట్, చూయింగ్ గమ్‌లలో కూడా ఉపయోగిస్తారు. దాల్చిన (సిన్నమోన్) అనేక భారతీయ వంటలలో కూడా ఒక సాధారణ పదార్థంగా వాడుకలో ఉంది. మాంసాహార, శాకాహార వంటకాల్లో సువాసన కోసంవాడే దాల్చినచెక్క మంచి ఔషధంగా కూడా పనిచేస్తుంది. దాల్చినచెక్కలో ఉండే 41 సమ్మేళనాల వల్ల మన శరీరానికి ఎన్నో ప్రయోజనాలున్నాయని అధ్యయనాల్లో తేలింది. సౌందర్యాన్ని కూడా పెంపొందింపజేస్తుంది. దాల్చినచెక్క పొడిని వాడటం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు. దీనిలో ఉండే యాంటిఆక్సిడెంట్స్ దీని అతిముఖ్యమైన లక్షణం. దాల్చినచెక్క చూర్ణం, యాలకుల పొడి సమపాళ్లలో నీటిలో కలుపుకుని కషాయంలాగా కాచి తాగితే గుండె బిగపట్టడం తగ్గుతుంది. అలాగే దాల్చినచెక్క కషాయం తాగితే వాంతులు వెంటనే తగ్గుతాయని కూడా వైద్యులు చెబుతున్నారు. ఔషధం సువాసన, రుచి మెరుగు పర్చడానికి అనేక మందుల



తయారీలలో ఒక ముఖ్యపదర్థారంగా ఉపయోగిస్తారు. కాస్తంత తేనెను వేడిచేసి అందులో ఒక టీస్పూన్ దాల్చినచెక్క పొడిని కలిపి రోజుకు 3 పూటలా తీసుకున్నా లేదా ఇదే మిశ్రమాన్ని శరీరానికి పూసినా దురదలు, ఎగ్జిమా, పొక్కులులాంటి దీర్ఘకాలిక చర్మ వ్యాధులను అరికట్టవచ్చు. బియ్యం కడిగిన నీటిలో మూడుగ్రాముల దాల్చిన చెక్క పొడిని కలిపి తాగితే మహిళలను వేధించే అధిక రుతుస్రావం బారి నుంచి కూడా కాపాడవచ్చు. పదిగ్రాముల దాల్చినచెక్క పొడి, పావు టీస్పూన్ దాల్చినచెక్క నూనె కలిపి సేవిస్తే విపరీతమైన కడుపు నొప్పితో బాధపడే వారికి తక్షణ ఉపశమనం లభిస్తుంది. పది గ్రాముల దాల్చినచెక్క పొడిని పావు లీటర్ వేడినీటిలో రెండు గంటలపాటు ఉంచి ఆపై దాన్ని



వడగట్టి సగభాగం చొప్పున రోజుకు రెండుసార్లు సేవిస్తే నీళ్ల విరేచనాలను అరికట్టవచ్చు. మొటిమలతో బాధపడేవారు దాల్చినచెక్క పొడిని తేనెతో కలిపి రాసుకుంటే తగ్గుముఖం పడతాయి. దాల్చినచెక్కలో అధిక ఆమ్లజనకాలు ఉంటాయి. సినామిక్ యాసిడ్, సినామల్ డీహైడ్ సినామెట్ తదితర రకాల గుణాలు ఇందులో ఉంటాయి. ఇతర మూలికలతో పోలిస్తే దాల్చినచెక్కలో అధికంగా యాంటీఆక్సిడెంట్స్ ఉంటాయి. ఈ అమ్లజనకాలు శరీరానికి చాలా ఉపయోగపడతాయి. రక్తంలో నైట్రిక్ ఆక్సైడ్ మెరుగుపడేందుకు, గుండె, మెదడు, ఇతర అవయవాలకు సంబంధించిన వ్యాధులబారిన పడకుండా ఉండేందుకు యాంటీఆక్సిడెంట్స్ సహాయ పడతాయి. అందువల్ల రెగ్యులర్‌గా దాల్చినచెక్కను తీసుకుంటే బ్రెయిన్ సంబంధించిన రోగాల బారిన పడకుండా ఉంటారు. సినామల్ డీహైడ్ అనే శక్తివంతమైన పదార్థం దాల్చినచెక్కలో ఉంటుంది. ఇది కేన్సర్ ప్రారంభదశలో ఉన్నప్పుడు దాంతో పోరాడే గుణాలు కలిగి ఉంటుంది. శరీరంలోని ఆరోగ్యకరమైన కణాలను ఉన్నప్పుడు దాంతో పోరాడే గుణాలు కలిగి ఉంటుంది. శరీరంలోని ఆరోగ్యకరమైన కణాలను రక్షించడానికి కూడా ఇది బాగా ఉపయోగపడుతుంది. పెద్దప్రేగుకు వచ్చే కేన్సర్‌ను తగ్గించే గుణం దాల్చినచెక్కకు ఉంటుందని క్లినికల్ అధ్యయనాల్లో తేలింది. దాల్చినచెక్కలో ఫ్లేవానాయిడ్లు అధికంగా ఉంటాయి. అవి శరీరం లోపల మంటను తగ్గిస్తాయి. అయితే దీనికి తేనె కూడా కలుపుకుని తాగితే ఫలితం బాగుంటుంది. రెండు టీస్పూన్ల తేనెలో సగం టీ స్పూన్ దాల్చినచెక్కపొడిని కలుపుకుని తాగాలి. ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్ స్థాయులను అదుపులో ఉంచగలుగుతుంది. రక్తం ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను కూడా అదుపులో ఉంచుతుంది. పలు రకాల గుండె సంబంధిత వ్యాధులు కూడా తగ్గుతాయి. హైపర్టెన్షన్ రోగుల్లో అధిక రక్తపోటును కూడా దాల్చినచెక్క తగ్గిస్తుంది. గ్లాసుడు గోరువెచ్చని నీటిలో ఒక నిమ్మకాయ రసాన్ని పిండి అందులో ఒక స్పూన్ తేనె, ఒక స్పూన్ దాల్చినచెక్క పొడిని కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉదయం పూట పరగడుపున తీసుకోవాలి. మధుమేహం ఉన్నవారికి దాల్చినచెక్క ఎంతగానో మేలు చేస్తుంది. నిత్యం ఒక స్పూన్ దాల్చినచెక్క పొడిని తీసుకుంటుంటే మధుమేహం తగ్గుతుంది. దీనివల్ల రక్తంలో ఉండే చక్కెరస్థాయిలు అదుపులోకి వస్తాయి. అలాగే టైప్ 2 మధుమేహాంను తగ్గించి పరిస్థితిని మెరుగుపరిచి, ఇన్సులిన్ సెన్సిటివిటిని శరీరంలో మెరుగుపరుస్తుంది. పరీక్షల సమయంలో, పనిభారం ఎక్కువగా ఉన్నప్పుడు తాగే టీలో కొద్దిగా దాల్చినచెక్కపొడి వేసుకుంటే మంచిది. ఇది మెదడు పనితీరుని చురుగ్గా మారుస్తుంది. దాల్చినచెక్క పొడిని కొట్టుకుని ఓ బాక్సులో నిల్వ చేసుకోవాలి. ఆరునెలల పాటు నిల్వఉంటుంది. దాల్చిన చెక్క పొడి కూరల్లో వేసినప్పుడు కూరలు త్వరగా పాడైపోవు. కొన్ని మొక్కలకి పురుగులూ, చీమలు పట్టుకొని ఉంటాయి. ఇవి లేత చిగుళ్లని తినేస్తుంటాయి. మొక్క మొదట్లో కొన్ని దాల్చినచెక్కల్ని ఉంచాలి. ఆకుల మీద పొడిని చల్లుతుంటే పురుగుల బెడద దూరమవుతుంది. ఇంట్లో సువాసన కోసం పువ్వులూ, ఆకులూ, ఇతరత్రా కలిపి ఓ గాజుపాత్రలో వేసుకున్నప్పుడు అందులో దాల్చినచెక్కలు లేదంటే..పొడిని వేసి చూడండి. కమ్మటి వాసన వస్తుంది. ఈ గాజు పాత్రని పడక గది, స్నానాల గది, కారులో..ఎక్కడైనా పెట్టొచ్చు. ❑



కథ

పి.వి.ఎస్.కృష్ణకుమారి

# ఎ టేల్ ఆఫ్ మిసెస్ అరవింద

చాలా కాలం తర్వాత ఈరోజు డైరీ మొదలు పెట్టాను. సంపత్ అనేవాడు... "డైరీ అంటే అందమైన గతాన్ని గుర్తు చేస్తూ, బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయటానికి, వర్తమానంలో మనం రాసుకొనే మన కథే" అని.

అలా చెప్పి ఈ డైరీ రాసే అలవాటు నాకు చేసి, నాకు విషాదాన్ని మిగిల్చి వెళ్లాడు. అతని మరణంతోనే డైరీ రాయటం మానేసాను.

మూడు సంవత్సరాల తర్వాత ఈరోజు మళ్లీ డైరీ రాస్తున్నాను. ఆనందంతో కాదు, నాలోని మానసిక సంఘర్షణని ఎవరికీ చెప్పుకోలేక అక్షర రూపం ఇస్తున్నా.

రేపు నేను వివాహం పేరుతో బలవంతంగా మరొక వ్యక్తిని నా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాను. సంపత్ స్థానంలో మరొకరిని ఊహించుకోవటానికి నేను ఎంత క్షోభ అనుభవిస్తున్నానో ఎవరికి తెలుసు? మరి ఎందుకు ఈ పెళ్లికి అంగీకరించినట్లు?

"ఏమ్మా అరవిందా! ఇంకా పడుకోలేదా?" దగ్గరగా వేసి వున్న బెడ్ రూం తలుపు తీసుకుని లోపలికి వస్తూ అడిగింది అరవింద తల్లి లలిత.

రాస్తున్న డైరీ పక్కన పెట్టి, తన పక్కనే పడుకుని నిద్ర పోతున్న బాబు మీద చేయి వేసి, తల్లి వైపు అభావంగా చూసింది అరవింద.

కూతురి మానసిక స్థితి అర్థం చేసుకున్న లలిత "అరవిందా, నీకు తోబుట్టువులు ఎవరూ లేరు. నిన్ను ప్రేమించి పెళ్లి చేసుకున్న సంపత్ చనిపోయాడు. నీవు, నీ బిడ్డ నష్టజాతకులని మీ అత్తగారు నీ మొహం చూడటానికి ఇష్టపడలేదు. పచ్చి బాలింత అనే కనికరం కూడా చూపలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మా తర్వాత నీకు ఎవరు అండగా ఉంటారు? బాబుకి పూర్తి ఊహ తెలియకముందే వాడికి తండ్రి స్థానం భర్తీ చేయాలనే మా తాపత్రయం" కూతురి పక్కన కూర్చుని, అంతకు ముందు చెప్పిన మాటలే మళ్లీ చెప్పింది.

"అవునమ్మా అరవిందా, రేపు పెళ్లి పెట్టుకుని ఇలా దిగులుగా ఉండవద్దు. ఇప్పుడు ఈ వివాహం నీకు ఆనందాన్ని ఇవ్వకపోవచ్చు. ఈ బాధ తాత్కాలికమే. రేపు బాబుకి బంగారు భవిష్యత్తు లభించిన రోజున కలిగే ఆనందం ముందు ఈ బాధ చాలా చిన్నది. గతం మర్చిపోయి, భవిష్యత్తు గురించి ఆలోచించు తల్లీ" అన్న తండ్రి శేఖర్ మాటలకు-

"అది కాదు నాన్నా, బాబుని వాళ్ల కుటుంబంలో వ్యక్తిగా ఎంతవరకు అంగీకరిస్తారోననే భయం నాలో క్షణ క్షణానికి పెరిగిపోతోంది" బేలగా అంటున్న కూతురి తల నిమురుతూ-

"పిచ్చితల్లీ, సారధి చాలా మంచివాడు. నిన్ను అర్థం చేసుకునే విశాల హృదయం ఉంది. మనసులో ఎటువంటి శంకలూ పెట్టుకోకుండా కొత్త జీవితానికి సిద్ధంగా ఉండు" అని ధైర్యం చెప్పి బయటకు నడిచారు శేఖర్, లలిత.

..........

అటు, ఇటు కుటుంబ సభ్యులు, షిర్డీ సాయిబాబా సమక్షంలో అరవింద మెడలో మూడు ముళ్లు వేసాడు సారధి.

"స్వామీ, సంపత్ జ్ఞాపకాలు మరుగున పడకముందే సారధి నా జీవితంలోకి ప్రవేశించాడు. మొదటి భార్యతో విసిగి వేసారి డైవోర్స్ తీసుకుని, కొత్త ఆశలతో మళ్లీ పెళ్లికి సిద్ధమైన సారధికి నేను న్యాయం చేయగలనా? అంతా నీదే భారం స్వామీ" మనస్ఫూర్తిగా వేడుకుంది అరవింద.

కార్లలో అందరూ ఇంటికి బయలుదేరారు. బాబుని మరుసటి రోజు వ్రతానికి తీసుకువస్తామని చెప్పి తమతో పాటు ఇంటికి తీసికెళ్లారు లలిత, ఆమె భర్త.

గతం తాలూకు జ్ఞాపకాలు మనసులో సునామీ సృష్టిస్తుండగా సారధి చేయి పట్టుకొని అత్తగారింట్లో అడుగు పెట్టింది అరవింద.

సారధికి తండ్రి లేడు. ఒక తమ్ముడు, చెల్లెలు. వాళ్లది బేరింగ్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ. తండ్రి చనిపోయాక అమెరికాలో ఉండే సారధి ఇండియాకి వచ్చి కుటుంబం, కంపెనీ బాధ్యత మొత్తం తను తీసుకున్నాడు. అప్పటికే సారధి పెళ్లయింది. సారధి భార్యకి ఇండియా రావడం ఇష్టం లేదు. అయినా సారధి పెద్ద కొడుకుగా బాధ్యతలు మీద వేసుకున్నాడు. భార్యతో గొడవలు మొదలైనాయి. సారధికి నరకం చూపించింది. చివరికి డైవోర్స్. సారధి చెల్లెలు, తమ్ముడి పెళ్లిళ్లు చేసాడు. తమ్ముడికి ఇద్దరు పిల్లలు. అందరూ ఒకే ఇంట్లో ఉంటారు. అటువంటి కుటుంబంలోకి అడుగు పెట్టింది.

సంపత్‌తో రెండేళ్ల వైవాహిక జీవితంలో మూడో మనిషి లేకుండా జాలీగా గడిపారు. అత్తగారు ఎప్పుడోగానీ వచ్చేది కాదు. కానీ ఇప్పుడు వీళ్లందరి మధ్య తాను ఎలా ఉండాలో!

..........



మర్నాడు సత్యనారాయణ వ్రతం. లలిత, శేఖర్ బాబుని తీసుకుని వచ్చారు. వాడ్ని తీసుకుని గదిలోకి వెళ్లి వెక్కి వెక్కి ఏడుస్తున్న అరవిందతో "తప్పు తల్లీ, ఇప్పుడే నీవు నిబ్బరంగా ఉండాలి. ముందు నీవు సారథిని నీ వాడుగా భావించు. బాబు గురించి నీవు అతనిని నిర్లక్ష్యం చేస్తున్నావు అనే భావన రానీయకుండా ఉండేందుకు మేం కొన్నాళ్లు బాబుని మా దగ్గరే ఉంచుకుంటాం. అప్పటిదాకా నీవు మనసు దిటవు పరుచుకొని ఉండాలి".

అని చెప్పిన మీదట అతి కష్టంమీద కన్నీళ్లు ఆపుకుంది. వ్రతంపీటల మీద, సోహమ్‌ని కూడా తమ పక్కనే కూర్చోపెట్టుకున్నాడు సారథి. బాబుని తీసుకుని లలిత, శేఖర్ వెళ్లిపోయారు.

ఎటువంటి ఆర్భాటం లేకుండా ఆ రాత్రి గదిలోకి వెళ్లారు అరవింద, సారథి. భయానక స్థితిలో ఆమె. తను కేవలం సంపత్ సొత్తు. అలాంటిది ఇప్పుడు మరో వ్యక్తితోనా! ఏ భూకంపమో వచ్చి భూమి రెండుగా చీలి భూమాత తనలోకి తీసికెళితే ఎంత బాగుండును! మౌనంగా మంచం పక్కనే ఉన్న స్టూలు మీద కూర్చుంది అరవింద.

"అరవిందా, నేను పెంట్ హౌస్‌లో పడుకుంటాను. కొన్ని ఫైల్స్ చూసుకోవాలి, నీకు ఇబ్బంది ఇక్కడైతే" అంటూ వెళ్లాడు.

ఒక ఉపద్రవం తప్పిన ఫీలింగ్ అరవిందకి. కావాలనే అతను వెళ్లాడని గ్రహించింది.

..........

కొత్త జీవితం ప్రారంభమైంది. అలవాటు పడటానికి ప్రయత్నిస్తున్నది అరవింద. కానీ సాధ్యపడటం లేదు. చిత్రంగా సారథితో పెళ్లి అనుకున్న తర్వాత సంపత్ జ్ఞాపకాలు మరీ ఎక్కువయ్యాయి. "సంపత్! ఎంత దగా చేసావు నన్ను" అని మనసు ఆక్రోశిస్తున్నది.

అత్తగారు రామలక్ష్మి మంచిదే కానీ అన్నీ ఆమె ఇష్ట ప్రకారమే చేయాలి. వంటతో సహా అన్ని పన్నులు ఆమే చేసుకుంటుంది. ఎవరూ చేయటానికి అవకాశం ఇవ్వదు. ఎవరు చేసినా నచ్చదు. ఒక్కొక్కసారి చాలా అభిమానంగా మాట్లాడుతుంది, అంతలోనే సీరియస్ అయిపోయి అంత దూరం మెయింటైన్ చేస్తుంది. కానీ సారథి అంటే చాలా అభిమానం, ప్రేమ. అతని మాటకు చాలా విలువనిస్తుంది.

మరిది, తోటికోడలు జాబ్‌కి వెళతారు.

సారథి తొమ్మిది గంటలకల్లా కంపెనీకి వెళతాడు. ఎన్ని పనులున్నా అరవింద అవసరాలు ఎప్పటికప్పుడు కనుక్కుంటూ, ఆమె ఈ ఇంట్లో ఎడ్జస్ట్ కావటానికి పూర్తి సహకారం ఇస్తున్నాడు.

ప్రతిరోజు, రాత్రిపూట తప్పనిసరిగా అరవిందతో కంపెనీ కబుర్లు, దాంట్లో ఉండే సాధకబాధకాలు చెపుతాడు. తన చదువు గురించి, తను అమెరికాలో ఉన్నప్పటి విశేషాలు అన్నీ చెపుతాడు. మొదట్లో నిరాసక్తతగా ఉండే అరవింద రానురాను వాటి మీద శ్రద్ధ చూపించసాగింది. ఎన్నో కబుర్లు దొర్లేవి ఇద్దరి మధ్య. ఉదయం కంపెనీకి వెళ్లిపోయే ముందు కూడా ఆమెకు ఏమైనా కావాలేమో అడిగి వెళ్లేవాడు.

..........

చూస్తూ ఉండగానే ఆరు నెలలు గడిచాయి. తోటికోడలు మాటలు ద్వారా ఎన్నో విషయాలు గ్రహించింది అరవింద.

రామలక్ష్మికి ఈ పెళ్లి ఇష్టమే కానీ బాబుని తెచ్చుకోవటం ఇష్టంలేదు. సారథి పట్టుదల వల్ల ఒప్పుకుంది.

ఆ మాటలు వినగానే అరవిందలో మళ్లీ భయం. అసలు తను పెళ్లికి ఒప్పుకున్నదే బాబుకోసం. వీళ్లు బాబుని ఎంతవరకు తమలో కలుపుకుంటారు? అందుకేనేమో అమ్మవాళ్లు కూడా బాబుని తమ దగ్గర

ప్రతిరోజు, రాత్రిపూట తప్పనిసరిగా అరవిందతో కంపెనీ కబుర్లు, దాంట్లో ఉండే సాధకబాధకాలు చెపుతాడు. తన చదువు గురించి, తను అమెరికాలో ఉన్నప్పటి విశేషాలు అన్నీ చెపుతాడు. మొదట్లో నిరాసక్తతగా ఉండే అరవింద రానురాను వాటి మీద శ్రద్ధ చూపించసాగింది.

ఉంచుకున్నది!

అలాంటి సందర్భాల్లో తన బాధంతా డైరీలో రాసుకుని గుండెభారం తగ్గించుకుంటుంది. తన బాధ సంపత్‌కి చెప్పుకుంటున్నట్లే భావిస్తుంది.

మరోపక్క అభిమానిస్తున్న సారథిని బాధపెడుతున్నాను అనే వేదన, బాబు భవిష్యత్తు ఆమెకి మనశ్శాంతి లేకుండా చేస్తున్నది.

ఆ రాత్రి సారథి తన రూంకి వెళ్లిపోయే ముందు అడిగింది "సోహమ్‌ని ఎప్పుడు తెద్దాం" అని.

"బాబు మనతోనే ఉంటాడు అరవిందా, ఆ విషయంలో నీవు నిశ్చింతగా ఉండొచ్చు" అని హామీ ఇచ్చాడు సారథి.

..........

గుళ్లో ఏవో ప్రవచనాలంటే రామలక్ష్మి వెళ్లింది. పనమ్మాయి బట్టలు ఉతకటానికి వచ్చి అరవిందతో కబుర్లు చెప్తూ "అమ్మా, సారథిబాబు చాలా మంచోరండీ. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తారు.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

**"మీరు ఈ ఆశ్రమం డోనర్ అని నాతో ఎందుకు చెప్పలేదు?" సారధి చిన్నగా నవ్వి "నీకు ఒక సంగతి చెప్పనా.. నేను నిన్ను చూసింది, నీ గురించి తెలుసుకున్నది ఇక్కడే" అన్నాడు.**

మా బాబు చదువుఖర్చు మొత్తం అయ్యగారే పెట్టుకుంటారు" అన్నది.

హఠాత్తుగా అరవిందకి ఈ కొత్త జీవితంలో తను విస్మరించిన విషయం ఒకటి గుర్తొచ్చింది. సంపత్ అలవాటు చేసిన వాటిలో నెలకొకసారి వృద్ధాశ్రమానికి వెళ్లి అక్కడ వాళ్లకు తోచిన సాయం చేయటం. "నన్ను, నా ఆశయాలని మర్చిపోయావా" అని సంపత్ నిలదీస్తున్నట్లే అనిపించింది.

ఆ రాత్రే సారధికి తను రెగ్యులర్‌గా వెళ్లే వృద్ధాశ్రమం అడ్రసు చెప్పి "రేపు మీరు ఆఫీసుకి వెళ్లేటప్పుడు నన్ను అక్కడ డ్రాప్ చేస్తారా" అని అడిగింది.

అది మొదలు వారానికి ఒకసారి వృద్ధాశ్రమానికి వెళ్లటం మొదలుపెట్టింది. వాళ్లకి ఇవ్వటానికి పండ్లు, మందు సారధి తెచ్చేవాడు.

ఇప్పుడు అరవిందలో మునుపటి నిరాసక్తత లేదు. తోటికోడలి సూటిపోటి మాటలకి విలువ ఇవ్వటం లేదు. అత్తగారంటే భయం పోయి ఆమెతో వృద్ధాశ్రమం కబుర్లు చెపుతూ ఆమె వద్దన్నా పనిలో సాయం చేయసాగింది. కొత్తగా అనాథాశ్రమానికి కూడా వెళుతున్నది.



ఇద్దరు వారం వారం పుట్టింటికి వెళ్లి బాబుని చూసి వస్తున్నారు. సోహమ్ కూడా సారధికి బాగానే మాలిమి అయ్యాడు. ఆమె మనసు వాడిని తన దగ్గరకు ఎప్పుడెప్పుడు తెచ్చుకుందామా అని తహతహలాడుతున్నది.

..........

ఎప్పటిలాగే బాబుని చూడటానికి వెళ్లినప్పుడు తల్లి అన్న మాటలు అరవింద మనసుని కుదిపేసింది.

"సారధి చాలా ఉత్తముడు. నిండుకుండ లాంటివాడు. తన మనసులో బాధ బయట పడనీయడు. అలాంటి వ్యక్తిని నీ ప్రవర్తనతో బాధపెట్టకు. పోయిన సంపత్ కోసం పాకులాడకు, సారధికి దగ్గర కావటానికి సన్నద్ధం కావాలి. అప్పుడే బాబు భవిష్యత్తు బాగుంటుంది".

అచేతనంగా నిలబడిపోయింది అరవింద. నిజమే, తను ఎంతసేపటికీ తన గురించి ఆలోచించుకుంటున్నది కానీ సారధికి ఏం చేస్తున్నది?

అరవిందలో అంతర్మథనం మొదలయ్యింది. మొదటిసారి సారధి గురించి ఆలోచించసాగింది. అతని పనులన్నీ తనే స్వయంగా చూడసాగింది. మెల్లగా ఆమె మనసు తెలియకుండానే సారధి వైపు పయనించసాగింది.

..........

"అరవిందా, ఈరోజు వృద్ధాశ్రమం నుంచి వచ్చేప్పుడు అమ్మవాళ్ల ఇంటికి వెళ్లి బాబుని తెద్దాం" అన్న సారధి మాటలకు అరవింద ఆనందం అర్ణవమైంది.

ఇద్దరూ వృద్ధాశ్రమానికి వెళ్లారు. ఎప్పుడూ అరవిందని గేటు దగ్గర దింపి వెళ్లిపోయేవాడు. అలాంటిది ఆరోజు అతను లోపలికి వెళ్లాడు.

సారధిని చూడగానే మేనేజర్ "ఏంటి సార్! ఈ మధ్య రావటం మానేసారు?" అన్నాడు.

"కంపెనీ పనులతో బిజీగా ఉండటం వల్ల నేను రాలేక నా భార్య అరవిందని పంపుతున్నాను" అన్నాడు.

అప్పుడే చూసాడు మేనేజర్ సారధి వెనుకే కొంచం దూరంగా ఉన్న అరవిందని.

"సార్, ఈ మేడమ్‌నా మీరు పెళ్లి చేసుకున్నది? వీరు గత ఐదు సంవత్సరాలుగా మాకు తెలుసు. భగవంతుడు అన్యాయం చేసినా మీరు మరో జన్మ ఇచ్చారు" అంటూ ఆశ్రమంలో అందరినీ హాల్లోకి పిలిపించాడు మేనేజర్.

అరవిందని తన భార్యగా పరిచయం చేసినప్పుడు అర్థమైంది అరవిందకి, సారధి ఈ ఆశ్రమం డోనర్ అని.

తాము తెచ్చిన పండ్లు, బట్టలు అందరికీ ఇచ్చారు.

కారులో కూర్చోగానే అరవింద అడిగిన మొదటి ప్రశ్న "మీరు ఈ ఆశ్రమం డోనర్ అని నాతో ఎందుకు చెప్పలేదు?"

సారధి చిన్నగా నవ్వి "నీకు ఒక సంగతి చెప్పనా.. నేను నిన్ను చూసింది, నీ గురించి తెలుసుకున్నది ఇక్కడే" అన్నాడు.

అప్రయత్నంగా అతని చేయి గట్టిగా పట్టుకుంది అరవింద. వదిలితే తనకి దొరికిన ఆసరా పోతుందేమో అన్నంత గట్టిగా పట్టుకుంది.

ఆ రాత్రి బాబు నిద్ర పోయాక సారధి ఒక గిఫ్ట్ ప్యాక్ అరవింద చేతికి ఇస్తూ–

"మన కష్టసుఖాల్లో పాలు పంచుకొనేవాళ్లు తోడుగా ఉన్నప్పుడు డైరీ రాసుకొనే అవసరం ఉండదు అని నా అభిప్రాయం. కానీ నీకు అలవాటు ఉందిగా, అందుకే కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఈ డైరీ నీకు" అన్నాడు.

దానిని ఓపెన్ చేయకుండానే "ఆ అవసరం రాదు ఇక" అంటూ సారధి వైపు నడిచింది అరవింద. ✦

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి.


మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. పువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

**sunmagvaartha@gmail.com**

# తెలుగు సాహిత్యంలో బ్రౌన్

**జయసూర్య**

**తెలుగు సాహితీ దీపకళిక కొడిగట్టి, చీకట్లు కమ్ముకొనే 250 సంవత్సరాల క్రితం కాలంలో ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అవతరించారు.**



**1824 నవంబరు 23న సి.పి.బ్రౌన్ యోగివేమన పద్యాలను 'వెర్సస్ ఆఫ్ వేమన'గా ఆంగ్లంలోకి అనువదించి తన ముందుమాటతో ప్రచురింపచేసి తెలుగు సాహిత్యానికి నాడు జీవం అందించారు.**

1215 పద్యాల ఆ గ్రంథం, తెలుగు భాష మాధుర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పి శాశ్వత కీర్తి ప్రతిష్ఠలు చేకూర్చింది. ఆ ముందుమాటలో బ్రౌన్‌దొర 'ఇటాలియన్ ఆఫ్ ఇండియా'గా మృదుమధురమైన తెలుగు, సంస్కృత పదాలు చేర్పుల కారణంగా స్వచ్ఛత కోల్పోతోందని పేర్కొన్నారు. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్, 1798 నవంబరు 10న కోల్‌కతాలో జన్మించిన ఆంగ్లేయునిగా లండన్‌లో విద్యాభ్యాసం అనంతరం బ్రిటిష్ ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉన్నతోద్యోగ విధులు నిర్వర్తిస్తూనే తెలుగు భాషకు ప్రాణం పోసారు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారతదేశంలో అడుగుపెట్టిన బ్రౌన్‌దొర తెలుగు భాష అవసాన దశకు చేరే కాలంలో దాదాపు మూడు దశాబ్దాలు అవిరళంగా ఊపిరి అందించారు. 1820లో థామస్ మన్రో మద్రాస్ ప్రెసిడెన్సీ గవర్నర్‌గా, ప్రతీ బ్రిటిష్ అధికారి స్వదేశీ భాష నేర్చుకోవాలని ఆదేశించడంతో నాటి బ్రిటిష్ అధికారులు తెలుగు పరిచయం సంపాదించవలసి వచ్చింది. వెలగపూడి కోదండరామ పంతులు దగ్గర తెలుగు అభ్యసించిన బ్రౌన్‌దొర 1822లో మచిలీపట్నం, తర్వాత రాజమండ్రి, గుంటూరు, కడప ప్రాంతాలలో విధులు నిర్వర్తిస్తూనే, తెలుగు భాషాభిమానిగా విశేష సేవలందించారు. తొలి తెలుగు శబ్దకోశాన్ని పరిష్కరించి ప్రచురింపచేసారు. గ్రీక్, లాటిన్, పారశీ, సంస్కృత భాషలలో పాండిత్యంగల బ్రౌన్‌దొర వేమన, సుమతీ శతకాలతో పాటు పల్నాటి యుద్ధం(1852) లాంటి చారిత్రక కావ్యాలను, నన్నయ, తిక్కన, శ్రీనాథుడు, పోతన మహాకవుల కావ్యకృతులు కనుమరుగవకుండా పరిష్కరించి ముద్రింపచేసారు. తెలుగుకు క్షీణ యుగ కాలం అది.

1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన బ్రౌన్‌దొర తాళపత్రాలలో నిక్షిప్తమై, శిథిలావస్థకు చేరుకొంటున్న అమూల్య సాహిత్యాన్ని ఎంతో వ్యయ ప్రయాసలతో సేకరించడం, పరిష్కరించడం, పరిశోధించడం, తెలుగుకు వ్యాకరణం, నిఘంటువు రూపొందించే అద్భుత సేవలతో సాహితీ వ్యాసంగాన్ని కొనసాగించారు. కడప, మచిలీపట్నంలో పాఠశాలలు నెలకొల్పి విద్యా వ్యాప్తికై కృషి చేసారు. నెలా నెలా పండితులకు జీతాలు, దానధర్మాలు, భాషా సేవా కార్యక్రమాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న తెలుగుకు పునః ప్రతిష్ఠ చేసారు. బ్రౌణ్యం తరువాతనే వీరేశలింగ యుగం ఆవిర్భవించింది.

అయిదేళ్ల వేమన పద్యాల సేకరణ, అధ్యయనం ఫలించి 'వెర్సస్ ఆఫ్ వేమన' వెలుగు చూసింది. బ్రౌన్‌దొర కొలువులో తాతాచారి పేరుతో ప్రాచుర్యం పొందిన నేలటూరి వేంకటాచలం సాన్నిహిత్యంతో బ్రౌన్ రచన ఆంధ్ర గీర్వాణ చందం 'పాపులర్ తెలుగు టేల్స్' ముద్రణ పొందాయి. పల్నాటి వీరచరితం, వసుచరిత్ర పరిష్కరించారు.




ఎందరో కవి పండితులు సహకారంతో 1841లో నల చరిత్ర, క్రమేపీ ఆంధ్ర మహాభారతం, భాగవతం, తెలుగు నేర్చుకొనే ఆంగ్లేయులకు వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు, 1842లో హరిశ్చంద్రుని కష్టాలు, ఎన్నో వ్యాఖ్యాన గ్రంథాలు, తెలుగు-ఇంగ్లీషు నిఘంటువులు, వ్యాకరణం బ్రౌణ్య సాహిత్యం వెల్లివిరిసింది. బ్రౌన్ డిక్షనరీ ఇప్పటికీ తెలుగులో ప్రామాణిక నిఘంటువుగా గుర్తింపబడుతోంది.

బ్రౌన్‌దొర, అసిస్టెంట్ జడ్జిగా వుండగా మచిలీపట్నంలో తిప్పాభొట్ల వెంకట శివశాస్త్రి, అద్వైత బ్రహ్మం వంటి తెలుగు పండితుల దగ్గర తెలుగుభాష, వ్యాకరణం, ఛందస్సు నేర్చుకున్నారు. వేమన పద్యాలు వెలుగు చూడడంతో తెలుగు సాహిత్యం, సామాన్యులకు వ్యవహారికంగా సన్నిహితమైంది. బళ్లారి, కడప, మద్రాస్, విశాఖపట్నం, మచిలీపట్నం వంటి తొమ్మిది ప్రాంతాల మారుమూల కుగ్రామాలలో నిక్షిప్తమైన వేమన పద్యాలు, మాటలు సజీవంగా పదిలమయ్యాయి.

నైతిక, వ్యంగ్య, నిగూఢ వేదాంత తత్వాన్ని సూటిగా మాండలికమైన సామాన్య, సరళమైన నిర్మొహమాట ధోరణిలో వ్యక్తీకరించిన యోగివేమన తెలుగు పద్యాలను ఆంగ్లంలో అద్భుతంగా సి.పి.బ్రౌన్ ఆవిష్కరింపచేసారు.

నాటి సమాజంలోని దురాచారం, జీవన దుర్నీతి మానవ స్వార్థ నైజాన్ని, అజ్ఞానాంధకారంలో చిక్కుకొన్న నాటి దుస్థితిపై యోగి వేమన తిరుగుబాటు ధోరణులను ఆంగ్లంలో బ్రౌన్‌దొర ప్రతిబింబించేయడంతో, యోగి వేమన ప్రపంచ సాహిత్యంలో అరుదైన మహనీయ స్థానాన్ని పొందగలిగారు.

మహా యోగి వేమన తాత్విక చింతనను ఒడిసి పట్టుకొన్న ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఆరాధ్యనీయ సాహితీవేత్త. బ్రౌణ్యం కొన ఊపిరిలో వున్న తెలుగుకు జీవం అందించింది.

# ఏ హోదాలో ఉన్నా..

యామిజాల జగదీశ్

**అది రామరాజ్యం కొనసాగుతున్న కాలం. ఒకరోజు రాముడు సభలో కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో ఓ కుక్క ఆ సభకు వచ్చింది. దాని తలకు దెబ్బ తగిలింది. రక్తం కారుతోంది. అలాగే అక్కడకు వచ్చింది. అందరూ దానిని చూసి ఆశ్చర్యపోయారు. రాముడు కూడా దాని వంక చూశాడు.**

“నువ్వు ఇక్కడికి దేనికోసం వచ్చావు? ఏమైంది? ఏం జరిగిందో భయపడకుండా చెప్పు” అని అడిగాడు రాముడు.

వెంటనే ఆ కుక్క నెమ్మదిగా చెప్పడం ఆరంభించింది.

“అయ్యా, నేను ఓ వీధిలో నడుచుకుంటూ పోతున్నాను. దారిలో ఒక వ్యక్తి ఎదురొచ్చారు. ఆయన వేదాలు, శాస్త్రాలు బాగా చదువుకున్న పెద్ద మనిషి. ఆయన ఏ కారణం లేకుండా తన దగ్గరున్న కర్రతో నా తల మీద కొట్టారు. ఆ దెబ్బతో రక్తం కారుతోంది. నేను జరిగింది పొల్లు పోకుండా చెప్పాను. మీరే విచారణ జరిపి తగిన తీర్పు ఇవ్వాలి” అన్నది కుక్క.



కుక్క చెప్పినదంతా రాముడు విన్నాడు.. ఆలోచించాడు. వెంటనే తన భటులను పిలిచాడు. వారిని సంఘటనా స్థలానికి పంపించాడు. “ఈ కుక్కను కొట్టిన ఆ మనిషిని తీసుకుండి” అని భటులను ఆజ్ఞాపించాడు.

భటులు వెళ్లారు. కుక్కను కొట్టిన వ్యక్తిని గుర్తించారు.

అతనిని రాముడి దగ్గరకు తీసుకువచ్చారు.

“ఏం జరిగింది?” అని రాముడు విచారణ మొదలు పెట్టాడు.

అప్పుడు ఆ వ్యక్తి చెప్పసాగాడు.

“నేను ఆ దారమ్మట వస్తున్నాను. ఓ చోట నాకడ్డంగా వచ్చిందీ కుక్క. నేనేమో త్వరత్వరగా అడుగులేస్తూ పోతున్నాను. ఇది నాకు అడ్డంగా వచ్చి ఇబ్బంది కలిగించడంతో కోపం వచ్చింది. అందువల్ల దాని తల మీద కొట్టాను” అన్నాడు.

వేదాలు, శాస్త్రాలు చదువుకున్న నేను కోపంతో గతి తప్పడం తప్పే. కాదనను. నేను చేసిన తప్పు ఒప్పుకుంటున్నాను. నాకు మీరు ఏ శిక్ష విధించినా శిరసావహిస్తాను” అన్నాడు.

“సరే ఇప్పుడు ఆ మనిషికి శిక్ష విధించాలి. ఏ శిక్ష విధించాలి. ఆలోచించాడు రాముడు. “అతనికి ఏ శిక్ష విధించాలో నువ్వే చెప్పు” అని రాముడు కుక్కను అడిగాడు.

అప్పుడు కుక్క “ఈయనను ఓ ఆలయానికి ధర్మకర్తగా నియమించండి...అదే ఈయనకు సరైన శిక్ష అని” అంది.

రాముడు అది విని ఓ చిన్న నవ్వు నవ్వాడు.

అక్కడ ఉన్న మిగిలిన వారికి ఆశ్చర్యం కలిగింది. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు.

అదేంటి? తప్పు చేసిన వారికి శిక్ష విధించడం సర్వసాధారణం. అది సముచితం కూడా. అది మానేసి తనను కొట్టిన వ్యక్తికి ధర్మకర్త హోదా కల్పించమని అడగడం విడ్డూరంగా ఉందే! అని అందరూ ఆశ్చర్యపోయారు. ఈ సందేహాన్ని తీర్చమని ఆ కుక్కను అడిగారు.

అంతట ఆ కుక్క ఇలా జవాబిచ్చింది.

“నేను పూర్వ జన్మలో ఓ ధర్మకర్తగా ఉన్నాను. అప్పుడు నేను ఎంతో అప్రమత్తంగా నా విధులను నిర్వహిస్తూ వచ్చాను. ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ కొన్ని సార్లు నన్ను నేను మరిచి ఆలయం ధనాన్ని నేను నా సొంతానికి వాడుకున్నాను. అది తప్పని తెలుసు. అందుకే ఈ జన్మలో ఇలా దెబ్బల పాలయ్యాను. ధర్మకర్తగా ఉండటం ఎంత కష్టమో నాకు తెలుసు. అందుకే నన్ను కొట్టిన ఆ వ్యక్తిని ధర్మకర్తగా నియమించమని కోరాను” అంది కుక్క.

దీని నుంచి ఏం తెలుస్తోంది? మనం ఏ పదవిలో ఉన్నప్పటికీ మనకు తెలియకుండా ఆ హోదాను అడ్డం పెట్టుకుని తప్పు చేయకూడదు అని అర్థం చేసుకోవాలి.

లేకుంటే మరు జన్మలో కుక్కగా పుట్టి ఎక్కడో అక్కడ తోకాడిస్తూ నిల్చోవాల్సిందే.

.......

ఆలయ వాకిట్లో రెండు కుక్కలు మాట్లాడుకుంటున్నాయి.

“గత జన్మలో నేను మనిషిగానే ఉన్నాను. ఓ ఆలయ పూజారి మాట విని అతనితో చేతులు కలిపాను. దేవుడి నగలను అపహరించి నాకిచ్చాడు. దొంగతనం చేసింది ఆ మనిషి. అతనిచ్చిన నగలను తీసుకుపోయింది నేను. అందుకే నేను కుక్కగా పుట్టాను. ఇప్పుడు ఆ పూజారి నాకు ఎదురుపడితే అతన్ని రక్తం కారేటట్టు కరుస్తాను” అంది ఒక కుక్క.

అప్పుడు రెండో కుక్క “తొందరపడి ఆ పని చేయకు. తిరిగి ఆ వ్యక్తి కూడా నిన్ను కరవచ్చు. ఎందుకంటే అతను కూడా ఇప్పుడు ఓ కుక్కగానే ఉన్నాడు” అంది.

“అది నీకెలా తెలుసు?” అని అడిగిన కుక్కకు జవాబిస్తూ– “ఆ పూజారిని నేనే” అంది రెండో కుక్క.

# తుర్కియెలో అద్భుత వింతలు


షేక్ అబ్దుల్ హాకీం జాని

**ఆసియా, ఐరోపాల ఖండాల మధ్య నెలకొని వున్న దేశం తుర్కియె. ఆ కారణంగా ఈ దేశాల మధ్య సఖ్యత తూర్పు, పడమరల కలయిక అయింది. దీని పూర్వ నామం టర్కీ. ముఖ్యంగా తుర్కియె ప్రధాన నగరం ఇస్తాంబుల్ ఇటు ఆసియా ఖండంలోనూ, అటు ఐరోపా ఖండంలోనూ వ్యాపించి ఉంది. తుర్కియెలో హెచ్చు శాతం మంది ముస్లింలు నివసిస్తున్నారు. ఈ దేశంలో అద్భుతమైన వింతలు అనేకం ఉన్నాయి. ఇవి ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.**

## కపడోసియా రాతి శిలా పర్వతం

ఇది తుర్కియె మధ్య భాగంలోని అంగటోలియన్ పీఠభూమిపై నెలకొని ఉంది. రాతి పర్వతాలు, గుహలు, పురాతన కాలం నాటి నుండి ఏర్పడిన ప్రకృతి సంపద. కపడోసియాలోని లవ్ వ్యాలీలో వీచే దట్టమైన గాలులకు నేలపై ధూళి గాలిలోకి ఎగురుతోంది. గులాబీ, పసుపు వర్ణంలో ఉన్న పర్వత శ్రేణులు, లోతైన లోయలతో ఆ ప్రాంతం నిండిపోయింది. దూరంగా చిమ్నీల ఆకారంలో ఏర్పడిన సహజ శిలా నిర్మాణాలు కనువిందు చేస్తాయి. అక్కడి వాతావరణం వెచ్చని, గాలులతో కూడుకుని అద్భుతమైన సౌందర్యంతో నిండిపోయింది. కొన్ని దశాబ్దాల క్రితం అగ్ని పర్వతాలు బద్దలై పుట్టగొడుగుల ఆకారంలో మొనతేలి ఉన్న కొని శిలలు సహజంగా రూపొందాయి. లక్షలాది సంవత్సరాల క్రితం వచ్చిన భూకంపాలతో పాటు అగ్నిపర్వతాల లావ పొంగి, నీరు, గాలి కలిసి అనూహ్యమైన పర్వతాలు ఏర్పడ్డాయి. ఇటువంటి అద్భుత పర్వతాలు ప్రపంచంలో మరెక్కడా కనిపించవంటే అతిశయోక్తి లేదు. 1985లో ఈ ప్రాంతాన్ని యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు. ప్రపంచం నలుమూలల నుండి మధ్య తుర్కియెలో ఉన్న ఈ ప్రదేశానికి విచ్చేసిన లక్షలాది మంది పర్యాటకులు హైకింగ్, హాట్ ఎయిర్ బెలూన్లలో విహంగ వీక్షణం చేస్తూ ఈ అద్భుత పర్వతాల సోయగాన్ని ఆస్వాదిస్తుంటారు.

కపడోసియా భూగర్భంలో ఒక భారీ అద్భుతం నెలకొని ఉంది. ఇక్కడ ప్రజలు తిరగని నగరం భూగర్భంలో దాగి ఉంది. భూగర్భంలో దాగి ఉన్న ఈ నగరంలో 20 వేల మంది బాహ్య ప్రపంచానికి కనిపించకుండా నివసించడానికి అనువుగా ఉంటుంది. కపడోసియా నగరాన్ని ప్రాచీన కాలంలో ఎలెన్‌గుబు అని పిలిచేవారు. ప్రస్తుతం డెరిన్‌కుయు అని పిలుస్తున్నారు. ఈ ప్రదేశం భూమికి 85 మీటర్ల అడుగున నిక్షిప్తమై ఉంది. ఇందులో



18 అంతస్తుల్లో సొరంగాలు ఉన్నాయి. 1963లో ఒక స్థానికుడు దీన్ని కనిపెట్టాడు. ఆయన పెంపుడుకోళ్లు ప్రతిరోజు కనిపించకుండా మాయమవుతూ ఉండటం, వాటిని ఆయన వెతికే పనిలో ఈ భూగర్భ నగరాన్ని కనిపెట్టేందుకు దారి తీసింది. ఆయన ఇంటిని పునర్నిర్మించుకుంటున్న సమయంలో ఏర్పాటు చేసిన ఒక ఖాళీ ప్రదేశం నుంచి ఆయన కోళ్లు రోజూ మాయమైపోతూ ఉండేవి. అయితే అవి తిరిగి కనిపించేవి కావు. ఆయన ఈ విషయాన్ని నిశితంగా పరిశీలించి భూమిని తవ్వి చూడగా భూమి లోపలకు వెళ్లేందుకు ఒక చీకటి మార్గం కనిపించింది. ఆ తర్వాత మరో 600 ఇళ్ల లోపల నుంచి డెరిన్‌కుయు నగరానికి ప్రవేశ ద్వారాలు దొరికాయి. ప్రపంచంలోనే భూగర్భంలో ఉన్న అతి పెద్ద నగరం ఇది. ఈ నగరంలో కొన్ని వేల ఏళ్ల పాటు జనజీవనం కొనసాగింది.

ఈ ప్రాంతం ఫ్రిజియన్‌ల నుంచి పెర్షియన్‌లు, బైజంటైన్ యుగంలో క్రైస్తవుల వరకు చాలా చేతులు మారుతూ వచ్చింది. చివరకు 1920లో గ్రీసు దేశానికి తుర్కియెకి మధ్య జరిగిన యుద్ధంలో కపడోసియాలో నివసిస్తున్న గ్రీకులు ఓడిపోవడంతో వారంతా మూకుమ్మడిగా ఈ నగరాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయారు. ఈ భూగర్భంలో ఉన్న గదులు కొన్ని వందల మైళ్ల విస్తీర్ణంలో పరుచుకుని ఉంటాయి. ఇదే ప్రాంతంలో కనిపెట్టిన 200కు పైగా చిన్న చిన్న భూగర్భ నగరాలు ఈ సొరంగంతో అనుసంధానమై ఉండవచ్చని చెబుతారు. ఈ నిర్మాణం పెద్ద భూగర్భ నెట్‌వర్క్ సృష్టించిందని అంటారు. ఈ ప్రవేశ మార్గాలను తవ్వకాలలో భూగర్భంలో దాగిన నివాసాలు, ఆహార నిల్వలు, పశువుల శాలలు, పాఠశాలలు, మద్యం దుకాణాలు, ఒక ప్రార్థనా మందిరం ఆనవాళ్లు కనిపించాయి. దీంతో ఈ భూగర్భ నగరం సందర్శకుల తాకిడితో నిండిపోయింది. ఈ నగర నిర్మాణం ఎప్పుడు జరిగిందనే విషయం కచ్చితంగా తెలియదు. క్రీస్తు పూర్వం 370లో ఏథెన్స్‌కు చెందిన సెనో ఫోన్ రచించిన అనాబాసిన్ గ్రంథంలో ఈ నగరం ప్రస్తావన కనిపిస్తుంది.



ఈ పుస్తకంలో ఆయన కపడోసియా చుట్టుపక్కల భూగర్భంలో నివసిస్తున్న అనటొలియన్‌ల గురించి రాశారు. ఈ ప్రాంతంలోని భూమిలో నీరు లేకపోవడంతో ఇలాంటి తవ్వకాలకు కపడోసియా అనువైన ప్రాంతమని ఫ్లోరిడా యూనివర్సిటీకి చెందిన క్లాసికల్ స్టడీస్ అసోసియేట్ ప్రొఫెసర్ ఆండ్రియా డి జియోర్ జీ తన రచనలలో పేర్కొన్నారు.

డెరిన్‌కుయులో 18 అంతస్తుల్లో సొరంగాలు ఉన్నాయి. ఇక్కడున్న రాళ్లను సులువుగా మలిచే అవకాశముంది. పది వేల సంవత్సరాల క్రితం ప్రజలు ఇక్కడ స్థిరపడ్డారని తెలుస్తోంది.

అరణ్యవాసులైన వీరు ఆధునిక యుగం ప్రారంభమయ్యేనాటికి వీళ్ల ఇక్కడి కొండరాళ్లను తొలచి తమకు కావలసిన పద్ధతిలో గుహలను తమకు అనువైన స్థావరాలుగా ఏర్పరచుకున్నారు. ఈ గుహలలో అత్యధిక ఉష్ణోగ్రతలో సైతం చల్లగా, శీతాకాలంలో వెచ్చగా ఉండటం విశేషం. నేటి ఆధునిక ప్రపంచంలో నివసిస్తున్న వారిని సైతం ఈ అద్భుత పర్వతాలు ప్రాచీన నాగరికతలోకి తీసుకువెళతాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

## నెమ్రుట్ డాగ్

తుర్కియెకు ఆగ్నేయ దిక్కుగా నెలకొని ఉన్నటారస్ పర్వతాలపై 150 మీటర్ల వ్యాసంతో 50 మీటర్ల ఎత్తయిన బోర్లించిన రాతిచిప్పలా కనిపించే శిఖరం సుదూర ప్రాంతాల వారికి సైతం కనిపిస్తుంది. సముద్ర మట్టానికి ఇది ఏడు వేల అడుగుల ఎత్తులో నెలకొని ఉంది. ఈ శిఖరంచుట్టూ ఉన్న మైదాన ప్రాంతంలో ప్రాచీన కాలానికి చెందిన అమూల్య శిల్పకళా సంపద ఉంది. శిఖరం ఎక్కడానికి మెట్ల మార్గం ఉంది. మెట్ల పక్కన అక్కడక్కడా, శిఖరంపై భాగంలో స్వాగతం పలుకుతున్నట్లు అతి పెద్ద రాతి పిల్లర్లు ఉన్నాయి. వీటిపై గద్ద వంటి బొమ్మలు ఉన్నాయి. కొన్ని పిల్లర్ల పైభాగం కాలగతిలో దెబ్బతిన్నాయి. క్రీ.పూ. మొదటి శతాబ్దానికి చెందిన అప్పటి రాజుల సమాధులు నెమ్రుట్ డాగ్‌లో ఉన్నాయి. ఇక్కడ కూర్చున్న భంగిమలో అయిదు పెద్ద సున్నపురాతి విగ్రహాలు ఉన్నాయి. శాసనాల ద్వారా ఆ ప్రాంత వాసుల దేవతా విగ్రహాలుగా తెలుసుకున్నారు. అటు, ఇటూ చివర భాగంలో సంరక్ష జంతువులుగా పేర్కొంటున్న సింహం, డేగల విగ్రహాలున్నాయి. ఇక్కడ రెండు వరసల ఇసుకరాతి శిలాఫలకాలు ఉన్నాయి. యూఫ్రటస్ నదీ పరీవాహక ప్రాంతంలో నెలకొని ఉన్న నెమ్రుట్ డాగ్‌లో అప్పటి రాజుల శ్మశానవాటిక ఉంది. మొదటి ఆంటియోకస్ క్రీ.పూ.69–36 మధ్య కాలంలో ఈ ప్రాంతాన్ని పరిపాలించాడు. ఇతను సింహాసనాన్ని అధిష్ఠించగానే తనను తాను థియోస్(దేవుడు)గా ప్రకటించుకున్నాడు. ఇతను పర్షియా, గ్రీకు విశ్వాసాలు, ఆచారాలతో కూడిన నూతన మతాన్ని ప్రవచించాడు. తొలుత ఈ శిఖరాగ్రంపైగల రాళ్లను తొలగించి చాలా విస్తీర్ణంతో సమతలం చేయించాడు. మైదాన ప్రాంతంగా మారిన ఆ ప్రదేశంలోనే దేవతా విగ్రహాలు ప్రతిష్ఠించి ఆ పక్కనే తన సమాధిని నిర్మించుకున్నాడు. ఈ సమాధి తూర్పు, పడమర, ఉత్తర దిక్కుల గోడలు 160 అడుగుల ఎత్తు, 500 అడుగుల సాంద్రతతో నిర్మించారు. పశ్చిమ దిక్కున 30 అడుగుల ఎత్తుతో మొదటి ఆంటియోకస్ థియోస్ విగ్రహాన్ని నిర్మించారు. ఆ విగ్రహం చుట్టూ దేవతలైన జ్యూస్, హెరాకిల్స్, టైడా, అపోలో విగ్రహాలు నిర్మించారు. కమాజీన్ పేరుతో ఏకైక స్త్రీమూర్తి విగ్రహం ఇక్కడ ఉంది. శతాబ్దాల తరబడి వచ్చిన ప్రకృతి వైపరీత్యాల వల్ల ఈ విగ్రహాల తలలు విరిగి కాళ్ల వద్ద పడి ఉన్నాయి.

తూర్పు దిక్కున కల అతి పెద్ద విగ్రహం క్రీ.పూ.108–69 మధ్య కాలంలో నిర్మించిన కలినికోస్ విగ్రహంగా భావిస్తున్నారు. ఇతను ఆంటియోకస్ తండ్రి అయి ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం.

యునెస్కోవారు ఈ ప్రాంతాన్ని 1987లో ప్రపంచ వారసత్వ ప్రవేశంగా ప్రకటించారు. ఈ పర్వతాన్ని శీతాకాలంలో సందర్శిస్తే బాగుంటుందని పరిశీలకుల అభిప్రాయం. ఆ సమయంతో ఈ పర్వతం మంచుతో కప్పబడి తెల్ల పర్వతంలా కనిపిస్తుంది. టన్నులకొద్ది మంచు పడి రమణీయంగా కనిపిస్తుంది. ఆ సమయంలో పర్వతం ఎక్కడం కష్టమే. అయితే అక్కడక్కడా మంచును తొలగించి పర్యాటకుల నడక కోసం మార్గం సుగమం చేసారు. ఈ పర్యాటక కేంద్రంలో ఉన్న అనేక దుకాణాలలో నెమ్రుట్ డాగ్‌లోని చారిత్రాత్మక విగ్రహాల నమూనా బొమ్మలను అమ్ముతుంటారు.



## పురాతన నగరం ఎఫెసెస్

తుర్కియె పశ్చిమ సముద్ర తీరంలో నెలకొని ఉన్న ఓడరేవుల పురాతన మహానగరం ఎఫెసెస్. ఇక్కడ ఆధునిక ప్రపంచ వింతలలో పేర్కొన్న చారిత్రాత్మక కట్టడం ఆర్టెమిస్ ఆలయం ఉంది. దీనిని టెంపుల్ ఆఫ్ ఆర్టెమిస్ అని పిలుస్తారు. ఆధునిక తుర్కియెలోని ఓడరేవు నగరమైన ఇజ్మీర్ నుండి దక్షిణాన 75 కి.మీ. దూరంలో పురాతన వాణిజ్య నగరం ఎఫెసెస్ సమీపంలో ఉంది.

ఈ ఆలయం అర్మతీయస్ అనే దేవత కోసం నిర్మించారు. క్రీ.పూ.550లో నిర్మించిన ఆర్టెమిస్ గొప్ప దేవాలయం. ఇది నేటికీ శిథిల రూపంలో ఎఫెసెస్‌లో ఉంది. పురాతన ప్రపంచంలోని ఏడు వింతలలో ఒకటైన ఈ ఆలయం 425 అడుగుల పొడవు, 220 అడుగుల వెడల్పుతో ఉంటుంది. దాదాపు 60 అడుగుల ఎత్తు, ఆరడుగుల వ్యాసంతో ఉన్న 127 స్తంభాలపై నిలబడిన మండపం ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తుంది. వీటన్నింటినీ పాలరాతితో అద్భుతంగా నిర్మించారు. అనటోలియాలోని తొలి మసీదుగా పేర్కొన్న ఇసాబే మసీదు, సిరిన్స్ గ్రామం, వర్జిన్ మేరీ హౌస్ సందర్శించదగినవి. ఇంకా శిథిలాలు, పురాతన థియేటర్, వ్యాయామశాల, అగోరా, ఓడియన్, బౌలెటేరియన్, ఫౌంటైన్లు, లైబ్రరీ ఆఫ్ సెల్సస్ ఉన్నాయి. క్రీ.పూ. 16వ శతాబ్దంలో గ్రీకు దేవాలయాల నిర్మాణానికి ముందే నిర్మించిన ఈ పురాతన నగరం గ్రీక్, రోమన్ సంస్కృతులు కలగలిపి ప్రసిద్ధి చెందింది. క్రీ.పూ. 16వ శతాబ్దంలో నిర్మితమైన ఆలయాన్ని ఆర్టెమస్ దేవతలకు అంకితమిచ్చారు. ఈ ఆలయ నిర్మాణానికి 120 సంవత్సరాల కాలం పట్టిందని చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన స్థలంగా ఇక్కడివారు భావిస్తారు. పురావస్తు శాఖవారు జరిపిన తవ్వకాలలో 530 మీటర్ల పాలరాతి రహదారి, దానికి ఇరువైపులా స్తంభాలతో నిలబెట్టిన మందిరాలు, ఆహ్లాదకరమైన భవంతులు, పునర్నిర్మించిన సెల్సియస్ గ్రంథాలయం, 15 మీటర్ల ఎత్తుగల అంతఃపురం మొదలైనవి కనుగొన్నారు. గ్రంథాలయానికి చేరువలోనే గ్రీకు కళామందిరాలు బయల్పడ్డాయి. ఈ యాంపిథియేటర్‌లో 66 వరుసలలో 24 వేల మందికి పైగా కూర్చోడానికి అనువుగా ఉంటుంది. ఇక్కడ ప్రదర్శనలు జరిగేటప్పుడు ఎటువంటి మైకు లేకుండా కళాకారుల స్వరం స్పష్టంగా ప్రేక్షకులకు వినిపించేలా యాంపిథియేటర్‌ను నిర్మించడం విశేషం.



ఎఫెసెస్ అప్పట్లో యాంపి థియేటర్‌కు ప్రసిద్ధి చెందింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది. క్రీ.పూ.7వ శతాబ్దంలో వచ్చిన వరదల కారణంగా ఆ నిర్మాణాలకు కొంత మేరకు వాటిల్లింది. ఆ తరువాత క్రీ.పూ.356లో జరిగిన అగ్నిప్రమాదంలో మరోసారి ధ్వంసమైంది.

## పముక్కేల్

తుర్కియె భాషలో పముక్కేల్ అంటే దూదికోట అని అర్థం. తుర్కియెలోని డెనిజ్లీ ప్రాంతంలోని పర్వత శ్రేణులు తెల్లగా మంచురాళ్లతో కప్పబడి తెల్లని పత్తిపూల వనంలా దర్శనమిస్తాయి. ఈ ప్రకృతి వింతను తుర్కియె ప్రజలు పముక్కేల్ అని పిలుస్తారు. దీన్ని నరకద్వారం అని కూడా పిలుచుకుంటారు. దాదాపు నాలుగు లక్షల సంవత్సరాల నుండి ఇక్కడ భూమి నుండి ఉబికి వస్తున్న వేడినీటి ఊటలే ఈ మనోహర ప్రకృతి అందాలకు కారణం. భూమిలో నుండి వచ్చిన వేడినీరు ఇక్కడి సున్నపు రాళ్లపై ప్రవహిస్తూ అందులోని వాయువులు వాతావరణంలో కలిసిపోయి మెల్లగా కాల్షియం కార్బనేట్‌గా మారిపోయి తెల్లని పత్తిలా ఆ ప్రాంతమంతా పరచుకుంటుంది.

ఇలా దాదాపు 3 కి.మీ. పొడవున, 160 మీటర్ల ఎత్తున ఇక్కడ కాల్షియం కార్బనేట్ పరచుకుని ఉంది. ఇటువంటి కాల్షియం కార్బనేట్ దిబ్బలు చైనాలోని కొన్ని ప్రాంతాలతో పాటు అమెరికాలోని పసుపురాతి జాతీయ ఉద్యానవనంలో కూడా ఏర్పడ్డాయి. అయితే పముక్కేల్ వీటన్నింటి కంటే అతి పెద్దది. చాలా సుందరమైనది. యునెస్కోవారు దీన్ని దూదికోట అని పేరు పెట్టి 1988లో ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు. ఇక్కడ ప్రవహించే నీరు జబ్బులను నయం చేస్తుందని అప్పటి ప్రజలు విశ్వాసం. సూర్యరశ్మి పడగానే తెల్లని ఈ దిబ్బల అందం ద్విగుణీకృతంగా కనిపిస్తుంది.

క్రీ.పూ.3వ శతాబ్దంలో ఇక్కడ హిరోపోలిస్ నగరం ఏర్పడింది. ఈ పట్టణానికి ఎదురుగా పముక్కేల్ సున్నపురాతి దిబ్బలు నెలకొని ఉన్నాయి. ప్రస్తుతం ఇది తుర్కియె దేశంలో ప్రముఖ పర్యాటక ప్రదేశంగా విరాజిల్లుతోంది. ఈ ప్రాంతంలో ఎక్కువ కాలం నివసిస్తే జలుబు, దగ్గు వస్తాయని ఇక్కడి వైద్యులు హెచ్చరిస్తున్నారు. సున్నంతో కలిసిన నీటి వల్ల ఇలా జరుగుతుందని వైద్యుల అభిప్రాయం. ప్రస్తుతం తుర్కియెలోని ఈ అద్భుత ప్రదేశాలన్నీ ప్రపంచ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్,
డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



స్థిరాస్తులకు సంబంధించిన విషయాలు లిఖిత పూర్వక ఒప్పందాలకు నోచుకోవు. పూర్తి అయ్యాయి అనుకున్న పనుల విషయంలో మళ్లీ చర్చలు, ధనం ఖర్చు చేయాల్సి వస్తుంది. వ్యాపార పరమైన విషయాల్లో తొందరపాటు వల్ల కొన్ని చేదు అనుభవాలు ఎదురవుతాయి. శక్తి సామర్థ్యాలు లేని వ్యక్తుల వల్ల అర్హత లేని ప్రయోజనాలు పొందుతారు.

## వృషభం



శ్రమించిన వాడికీ దొంగకు ఒకే విధమైన స్థానం, సన్మానం లభించడం మీరు సహించరు.ప్రయోజనాలు, కీర్తి పరిత్యాగం చేస్తారు. అసమర్థులతో కలిసి అందలం ఎక్కడం కన్నా నడిచి వెళ్లడమే మేలని భావిస్తారు. కొన్ని సిద్ధాంతాలకు తిలోదకాలు ఇవ్వడం మీ వల్ల కాదని గ్రహిస్తారు. కాంట్రాక్టులు, భూమి సంబంధిత వ్యవహారాలు లాభిస్తాయి.

## మిథునం



వ్యాపారంలో లాభాలు సంతృప్తినిస్తాయి. భాగస్వాములు అసమర్థత వల్ల అధికారులతో ఇబ్బందులు వస్తాయి. ఉద్యోగంలో స్థాన చలనం తప్పకపోవచ్చు. అయినప్పటికీ మీ ఉనికిని కాపాడుకోగలుతారు. కుటుంబంలో, బంధువుల్లో ఏకాభిప్రాయం సాధించి కొన్ని సమస్యలు పరిష్కరిస్తారు. క్రమశిక్షణ లేని మిత్రుల వల్ల ఇబ్బందులు పడతారు.

## కర్కాటం



మనో నిగ్రహంతో, కఠినమైన క్రమశిక్షణతో ఆరోగ్యం కాపాడుకుంటారు. మీరు అందలం ఎక్కించిన వ్యక్తులతో భేదాభిప్రాయాలు రావొచ్చు. విద్యార్థినీ, విద్యార్థులు మేథో దక్షిణామూర్తి రూపు ధరించటం ఉత్తమం. ఉద్యోగంలో, వృత్తిలో ప్రమాదకరమైన వ్యవహారాలను విజయవంతంగా ఎదుర్కొంటారు. సామాజిక సేవా రంగాలకు సంబంధించిన పదవులు లభిస్తాయి.

## సింహం



ఆధ్యాత్మికంగా, వ్యాపార పరంగా మనసుకు తోచినట్లు చేస్తారు. ప్రతి విషయానికీ ఆందోళన పడడం, భయపడడం మానుకుంటారు. సహకరించని కుటుంబ సభ్యులను పట్టించుకోకుండా పొదుపు చేస్తారు. విలువైన ఆస్తులను కొనుగోలు చేస్తారు. అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించిన వ్యవహారాలు ముడి పడతాయి, అనుకూల ఫలితాలు వస్తాయి.

## కన్య



వృత్తి, ఉద్యోగం, వ్యాపార పరంగా ఎదురైన సమస్యలను పరిష్కరించుకోవడానికి న్యాయస్థానాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రేమ వివాదాలు పెనుసంకటంగా మారుతాయి. సాంప్రదాయాలు చట్టుబండలు కాకుండా ఉండటానికి ఎంతో శ్రమిస్తారు. ఆత్మీయ వర్గం, మీరు ఆశలు పెట్టుకున్నవాళ్లు మీ ఊహలను తలకిందులు చేస్తారు.

## తుల



జీవితంలో ఇక నెరవేరవు అనుకున్న కొన్ని ముఖ్య కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేస్తారు. ఆత్మీయులు, సన్నిహిత వర్గం, బంధువర్గం అధికమవుతారు, దగ్గరవుతారు. చిరునవ్వుల వెనుక దాగిన విష మనస్తత్వాలను గ్రహించలేరు. మీకు తెలియకుండానే పరపతి దుర్వినియోగం అవుతుంది. మితిమీరిన ఆత్మవిశ్వాసం వల్ల నష్టపోతారు. డాక్యుమెంట్స్ లోపాలను గుర్తించి ముందు జాగ్రత్త పడతారు.

## వృశ్చికం



ఇతరుల తోడు లేకుండా ఏ పనీ చేయలేని మనస్తత్వం నష్టం, విమర్శలు తెచ్చి పెడుతుంది. న్యాయ నిపుణుల సలహాలు అవసరమవుతాయి. క్రిమినల్ కేసులకు సంబంధించి పరోక్షంగా ఇబ్బందులు ఎదురవుతాయి. మీ వర్గం, అనుచరులు చేసిన తెలివితక్కువ పనులకు ఇలాంటి తంటాలు వస్తాయి. రాజకీయ రంగంలో మీకు ముఖ్యమైనవారు, మీ సహాయం పొందినవారు కీలక సమయంలో తప్పుకుంటారు.

## ధనుస్సు



కుటుంబంలో మరొకరి సంపాదన మొదలవుతుంది. దాంతో ఆర్థిక భారం తేలిక అవుతుంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు లాభిస్తాయి. సువర్ణం జాగ్రత్తగా పరచాలి, చోర భయం పొంచివుంది. చిన్న చిన్న రాజకీయ నాయకులతో విభేదాలు పతాక స్థాయికి చేరతాయి. ప్రేమ వివాహాల పట్ల మీ అభిప్రాయాలు వివాదాస్పదం అవుతాయి. ఉన్నత స్థాయి అధికారుల వల్ల ఇబ్బందులు ఎదురవుతాయి.

## మకరం



ఆర్థికంగా ఒత్తిడి వున్నప్పటికీ అందుకు తగిన విధంగా ఆదాయం సర్దుబాటు అవుతుంది. ఎంత ఆదాయం వచ్చినా మిగలడం అనుమానమే. ఇతరులు మీ ప్రాధాన్యతను తగ్గించేందుకు చేసే ప్రయత్నాలు ఫలించవు. మీరు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోలేరు. మీ సమస్యలను అధిగమించి ఇతరులకు సహాయం చేసే స్థితిలో మీరు ఉండరు. ఈ వాస్తవం ఎవరూ నమ్మరు. ప్రయోజనాల ప్రాతిపదికగా శ్రమిస్తారు.

## కుంభం



మీ నుండి ఇతరులకు అవసరమైన వివరణ లభించదు. మనుషుల మీద నమ్మకం పోతుంది. అబద్ధాలు, నమ్మకద్రోహం వినుగు కలిగిస్తాయి. మౌనంగా పని చేసుకుపోతారు. బాధ్యతలు, వైరాగ్యం అవినాభావ సంబంధం కలిగి వున్నాయని గ్రహిస్తారు. మీ అభివృద్ధికి బాటలు వేసిన వారిని విస్మరించారన్న విమర్శలు అధికమవుతాయి.

## మీనం



భగవంతుడు అన్ని ఇచ్చినా మిగతావి మనం చేసుకోవలసిన ముఖ్య కార్యాలు ఉన్నాయన్న భావంతో అవిశ్రాంతంగా కృషి చేస్తారు. కాంట్రాక్టులు, సబ్ కాంట్రాక్టులు లాభిస్తాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అనుకున్నంత వెసులు బాటు ఉండకపోవచ్చు. స్త్రీలకు సంబంధించిన విషయాల్లో ఏదో ఒక వివాదం/ఆర్థిక భారం పడుతుంది. గోప్యంగా ధనం ఖర్చు చేసి మీ వాళ్లను న్యాయపరమైన చిక్కుల నుండి రక్షించాల్సి వస్తుంది.

# 'సంఘాత మేళ దోషం' అంటే?

**వాస్తువార్త**


**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**
**డా॥ దంతూరి పండరినాథ్**
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458




కె.సత్యప్రసాదిని - ఎమ్మిగనూరు

ప్రశ్న: నేను మా తండ్రిగారు కట్టిన ఇంట్లో ఉంటున్నాను. మా ఇంటి స్థలంలో రెండు ఇండ్లు వున్నాయి. తూర్పు సింహ ద్వారం(పడమరలో వున్న ఇల్లు). ఆ ఇంట్లో నేనూ, మా కుటుంబ సభ్యులు వుంటున్నాం. ఎదురుగా తూర్పు ఇల్లు అద్దెకు ఇచ్చాం. ఈ రెండు ఇండ్ల ప్లానులు మీకు పంపించాను. తూర్పు పడమరల రెండు ఇండ్లలోనూ తూర్పు ఇంటికి చాలా దోషాలు వున్నాయి. తెలిసిన దోషాలు సవరించటాలంటే సందేహం. గోడ మీద రెండు వైపులా కట్టిన ఇంటికి 'సంఘాత మేళ దోషం' అని మా గురువుగారు అన్నారు. పది గుమ్మాలు కూడా దోషం. దక్షిణ భాగాన ఆగ్నేయాలలో సెప్టిక్ లెట్రిన్ తూర్పు గోడకు కలిసి వున్నది. మీరిచ్చే సలహాలు చదువుతుంటే ఈ దోషాలు తెలిసాయి. ప్రత్యామ్నాయాలు తెలుపగలరు.

దిగర్వణ-వర్గురీత్యా అర్వణం నామ నక్షత్ర రీత్యా ఎవరు ఏ దిశలో ఇల్లు కట్టాలో ఏమీ వివరించలేదు. గృహ గణిత పథకాలు ఏమీ చెప్పలేదు. ఒకే ముఖ సింహద్వారం ఇల్లు అందరికీ నప్పునా? నామ నక్షత్రం 'వర్గు'రీత్యా వెంకట్రావు అనే ఆ నామ 'య' వర్గు- వీరు దక్షిణపు ఇల్లు అంటే స్థలంలో దక్షిణ భాగంలో ఇల్లు కట్టిన శత్రు వర్గు కదా! ఉత్తరం 'య' వర్గు ఏనుగు-దక్షిణం 'చ' వర్గు సింహం. ఏనుగు వెళ్లి సింహం వద్ద వుండగలదా? (అంటే శతృగృహం అవదా?) నామ ప్రథమాక్షర రీత్యా వర్గరీత్యా అర్వణం చూడాల్సిన అవసరం లేదా? పూర్వ గ్రంథాలు కృష్ణవాస్తు-మయవాస్తు, సనత్కుమార వాస్తు మొ॥ వాటిల్లో అన్ని వర్గులు అర్వణములు తెలియచేసారు కదా. ఈ సందేహం తీరుస్తారని ఆశిస్తున్నాను. మరొక సందేహం. ప్రతి గదికీ తూర్పు, ఉత్తరాల వైపు గుమ్మాలు వుండాలి, అవే ఉచ్చస్థానాలు అంటున్నారు. పడమర-దక్షిణ వైపుల గుమ్మాలు వుండగూడదంటున్నారు.

**జవాబు:** మీ ఇంటి తూర్పు భాగంలో తూర్పు ప్రహరీ గోడకు ఆనుకొని వున్న గృహానికి 'సంఘాత మేళ దోషం' వున్నమాట వాస్తవమే. నిజానికి తూర్పు గోడను ఆనుకొని గృహ నిర్మాణం సరైంది కాదని మీకు తెలిసే ఉంటుంది. ఒకవేళ తూర్పున ఎక్కువ ఖాళీ స్థలంగానీ వదిలి వుంటే ఒకే చతురస్రాకార ఖాళీ స్థలంలో రెండు గృహాలు ద్విశాలాకృతిలో ఏర్పడి మీకు చాలా మంచి ఫలితాలు వచ్చేవి.

'సంఘాత మేళా దోష' నివారణకయిన తూర్పు ఖాళీ స్థలం కావాలనుకున్నా మీరు తూర్పున వున్న గృహాన్ని పూర్తిగా నిర్మూలన గావించటం ఉత్తమం. అలా కానప్పుడు కనీసం తూర్పున వున్న ఖాళీ స్థలాన్నయినా సేకరించి యింటికి కలుపుకోవటం వల్ల కొంతవరకు మంచి జరుగుతుంది.

'సంఘాత మేళ దోష నిర్మూలనకు'గాను మధ్య వున్న గోడను నిర్మూలించాలి. కానీ అది వీలుపడదు. ఆ గోడలో నుండి ఉచ్చ స్థానాల్లో ద్వారాలు అమర్చి, నడక ప్రారంభించటం వల్ల ఆ దోషం కొంతవరకు నివారించబడుతుంది. కానీ అది పూర్తి పరిష్కారం కాదు.

నామ, నక్షత్రాది జాతక వివరాల ప్రకారం ఒక వ్యక్తి ప్రస్తుత జాతక పరిస్థితికి ప్రస్తుత నివాస గృహ వాస్తు ఫలితాలు ఏ విధంగా సమన్వయ పడుతున్నాయో క్రోడీకరించుకొని ఆ వ్యక్తికి జపశాంతుల విషయంలో/రత్న ధారణ గురించిగానీ, వాస్తు విషయంలో గానీ సలహాలివ్వవచ్చు. కానీ నామ నక్షత్రాలను బట్టి సింహద్వార నిర్ణయం, ఆయం, వర్గం మొ॥ విషయాలు సరైనవి కాదని నా అభిప్రాయం. వాస్తు అందరికీ ఒకేలా వర్తిస్తుంది. పేరునిబట్టి పంచభూతాల 'గతి' మారదు.

దక్షిణ ఆగ్నేయంలో వున్న సెప్టిక్ ట్యాంక్‌ని పూడ్చి మధ్య తూర్పు లేదా మధ్య ఉత్తర భాగంలో తవ్వించవచ్చు. ప్రతి గదికి తూర్పు, ఉత్తర స్థానాలే ఉచ్చ స్థానాలనీ; దక్షిణ పశ్చిమాలు నీచ స్థానాలని ఎవరన్నారు? అవి మధ్యమ స్థానాలు అవుతాయి. తూర్పు గోడకి తూర్పు ఈశాన్యం, ఉత్తర గోడకు ఉత్తర ఈశాన్యం, పశ్చిమ గోడకు పశ్చిమ వాయవ్యం, దక్షిణ గోడకు దక్షిణ ఆగ్నేయం ఉచ్చ స్థానాలవుతాయి. ఆ స్థానాల్లో తలుపులుండి నడక జరగడం ఉత్తమ ఫలితాలనందిస్తుంది. ఈ సూత్రం మొత్తం ఇంటికి, ప్రతి గదికి వర్తిస్తుంది. మీరు కూడా 'వాస్తు' చెప్పే వృత్తిలో వున్నందువల్ల ఇంత వివరంగా తెలియచేసాను.

## దిక్కులకు చేస్తున్న అపచారం


**మనం** వుండేది స్వంత ఇల్లయినా, కిరాయి ఇల్లయినా సరే దిక్కుల్లో సరయిన శ్రద్ధ తీసుకోకపోతే దుష్ఫలితాలను అనుభవించక తప్పదు. ఇల్లు సరిగ్గా లేకపోతే దాని మంచీ, చెడు ఫలితాలు స్వంతదారునికే వుంటాయనీ, కిరాయిదారులకు వుండవనే నమ్మకం చాలా మందికి ఉంటుంది. అది సరైన అభిప్రాయం కాదు.

ఉదా: మనం ఓ షాపులో సైకిలును కిరాయికి తీసుకున్నామనుకోండి. ఆ సైకిలు బ్రేక్స్ సరిగ్గా పని చేయకపోతే దాన్ని నడిపినంతసేపు మనం ఎంతో జాగ్రత్తగా నడపాల్సి వస్తుంది. రిపేరు ఖర్చులు యజమాని ఎప్పుడోగానీ భరించకున్నా సైకిలు మన చేతిలో వున్నంతవరకు అప్రమత్తతతో వుండాలి కదా. కిరాయి ఇల్లు కూడా అంతే.

మరో ఉదా: ఇల్లు బాగానే ఉంటుంది. కానీ ఇంట్లో కిరాయికి వుండేవాళ్లు దాన్ని సరిగ్గా చూసుకోరు. దిక్కుల విషయంలో నిర్లక్ష్యం చేసి ఇష్టం వచ్చినట్లు గదుల్లో సామాన్లు అమర్చుకుంటారు. మంచి సైకిలు కిరాయికి దొరికినా విచక్షణా రహితంగా నడిపి పాడు చేయడం లాంటిది ఇది. ఇంటి స్వంతదారు అయినప్పటికీ చక్కగా వున్న ఇంట్లో కూడా వస్తువులను అమర్చుకోవటంలో నిర్లక్ష్యం చూపిస్తే చెడు ఫలితాలను అనుభవించాల్సిందే. నిర్ణీత పద్ధతుల్లో ఇంటి దిక్కుల్లో వస్తువులను అమర్చుకోలేకపోవటం మనిషి దిక్కుల పట్ల చేస్తున్న అపచారాల్లో ఒకటి.

# పదరంగం-19

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. అల్లుడిని తమ ఇంట్లోనే ఉంచుకోవడం (4)

3. నింద (4)

7. తండ్రిసోదరి అటునించి వచ్చింది (2)

9. సంపాదన సవ్యంగా లేదు (3)

10. కాపు (3)

11. గౌరవం, మంచి నడత (3)

12. ఒక అప్సరస (4)

14. కాలితే వచ్చే పొక్కు, పెద్ద అరుపు (తిరగబడింది) (2)

15. పంచమ వేదం (5)

20. ఓడలో నావికుల పెద్ద (3)

22. ఒక అగ్రరాజ్యం (4)

23. సరిచేయుట, 11 అడ్డంతోటిది కూడా (3)

24. చచ్చిన జంతువులను తినే పక్షి చెదిరింది (3)

25. హామీ, పూచీ (3)

26. చాలామంది చెదరిపోయారు (4)

### నిలువు

1. చాలా ఎక్కువగా వుండడం (6)

2. నేరుగా పైకి 4)

4. పరిపక్వత (4)

5. చిన్న కడవ (2)

6. మన దేశపు అత్యున్నత పౌర పురస్కారం పైకొచ్చింది (5)

8. సమ్మతి, అంగీకారం (4)

13. పరమ పిసినారి (2)

16. ఆర్తనాదాలు (5)

17. రామారావు, సావిత్రి, కాంతారావుల సూపర్ హిట్ చలనచిత్రం (5)

18. ఒడ్డు (2)

19. ఆవిడ (2)

20. కావలసిన వస్తుసామగ్రి (4)

21. తగినట్లు సరిగా లేదు (4)

22. పరిమళద్రవం/ తైలం (3)

## పదరంగం-17 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| బో1 | భా | శం | క2 | రు | డు3 | | వీ4 | క్లిం | చు5 |
| నా | | | రో | | కు6 | లా | సా | | ట్ట |
| లు7 | కా8 | ట | నా | | ట | | | ఇం9 | పు |
| | పీ | | | లు10 | ర్కొ | దు | ఎ11 | | చూ |
| అ12 | నం | త13 | రం | | క | | రు14 | ప | పు |
| ట్ట | | వ్వ | | గా15 | | తా16 | వు | | |
| డు | | | నీ17 | లం | | మ | | ఆ18 | దా19 |
| గు20 | త్తే | దా21 | రు | | చు22 | ర | క23 | | చ |
| | | హా | | చి24 | ట్టా | | రి25 | ది | పం |
| స26 | మా | న | త్వం | | లు27 | గు | వే | | ర |

### పదరంగం-17కి జవాబులు పంపించినవారు

1. జి.సుబ్రహ్మణ్యం గౌడు–రాజంపేట; 2. యం.వి.రమణకుమారి–హైదరాబాద్; 3. సి.ప్రభు–హైదరాబాద్; 4. కె.గీతమ్మ–ఖమ్మం

జవాబులు పంపించాల్సిన చిరునామా:

**పదరంగం** ఆదివారం వార్త, నం.396,


లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ........................................................................


........................................................................


ఊరు : ........................................................................

ఈ వారం కా‘ర్టూన్స్’


...రేవంత్ సార్...!!
అమ్మ గౌన్ వేసి తీసుకెళ్తున్నది.. షేమ్ గా ఉంది.. హాఫ్ టికెట్ గాడిని.. నాక్కూడా "ఫ్రీ" అని చెప్పవా...!!?
Zakir...


పైన నిలదొక్కుకోవడం చాలా కష్టం బ్రో..!!
Zakir...


ఓడలు బండ్లు, బండ్లు ఓడలు అవడం అంటే ఇదేనా మావా?!
Zakir...



వినూత్న
శైలిలో నిర్మించిన ఈ వంతెన
అచ్చంగా పాదచారుల కోసమే సుమా! కజకిస్థాన్‌లోని
ఈ వంతెన రాజధాని ఆస్థానాలోని ఇషిమ్ నది పైన నిర్మించారు.
నది అవతలి తీరంలో వున్న నేషనల్ పార్కుకు చేరుకొనేందుకు
ఉపయోగపడుతుంది. రాత్రి వేళ మరింత ఆకర్షణీయంగా
కనిపిస్తుందీ వంతెన.











